# ప్రజా తపన

prajathapana.com

*News that matters*




**సత్యం, పవిత్రత,నిస్వార్థం, భూనభోంతరాల్లోని ఏ శక్తీ ఈ సుగుణములతోజాజ్వల్యమానంగా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా వారు ప్రతిఘటించగలరు.**

**- స్వామి వివేకానంద**


సంపుటి :01 సంచిక:82 శుక్రవారం 12 మే 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


# రైతులకు న్యాయం జరిగే వరకూ పోరాడతా

## సీఎం స్పందించకపోవడంతోనే ఇబ్బందులు- జనసేన అధినేత పవన్ కల్యాణ్

**రాజమండ్రి**

రైతులపై కేసులు పెడితే ఊరుకునేది లేదని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అన్నంపెట్టే రైతు తరచూ కన్నీరు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజమండ్రిలో జనసేన నూతన కార్యాలయంలో రైతులతో ముఖాముఖి నిర్వహించారు. అకాల క్షేత్ర స్తాయి పర్యటనలో సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవటం, వ్యవసాయ శాఖ మంత్రి పర్యటించకపోవటం, ముఖ్యమంత్రి స్పందించకపోవటం వల్ల రైతులు ఇబ్బందులు పడ్డారన్నారు. రుణమాఫీ వద్దని... పావలా వడ్డీకి ఎకరానికి 25 వేలు రుణం ఇస్తే సరిపోతుందని రైతులు చెబుతున్నారని తెలిపారు. గోనె సంచులు ఇవ్వకపోవటం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారన్నారు. ప్రతీ రైతుకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

అన్నంపెట్టే రైతు తరచూ కన్నీరు పెడుతున్నారని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. రాజమండ్రి పర్యటనలో

02





## బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుఫానుగా మారే అవకాశం

**చెన్నై:**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో పాటు ఉత్తర తమిళనాడు కోస్తా తీరంపై ఆవహించివున్న ఉపరితల ఆవర్తనం కారణంగా అల్పపీడనం ఏర్పడివుంది. ఇది మరింతగా బలపడి తుఫానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించారు. దీంతో నాగపట్టణం, తూత్తుక్కుడి, పాంబన్ హార్బర్లలో ఒకటో నెంబరు తుఫాను హెచ్చరికను జారీ చేశారు. వాతావరణంలో మార్పుల కారణంగా డెల్టా జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నాయి. అదేవిధంగా అధికారుల హెచ్చరిక నేపథ్యంలో నాగపట్టిణం జిల్లాకు చెందిన దాదాపు 20 వేల మంది జాలర్లు సముద్రంలోకి వెళ్ళలేదు. అలాగే, 27 జాలర్ల గ్రామాల్లో జాలర్లకు చెందిన ఆరు వేల ఫైబర్ బోట్లు చేపల వేటకు దూరంగా ఉన్నారు.



## సుప్రీం లో ఉద్దవ్ ఠాక్రే వర్గానికి ఊరట

**న్యూఢిల్లీ :**

సుప్రీంకోర్టులో ఉద్దవ్ ఠాక్రే వర్గానికి ఊరట లభించింది. శివసేన వ్యవహారంపై నేడు సుప్రీంకోర్టు తీర్పును వెలువరించింది. ఏక్ నాథ్ షిండే చీఫ్ విఫ్ నియామకం చెల్లదని, అది చట్ట వ్యతిరేకమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. పార్టీలో విభేదాలను పార్టీలోనే పరిష్కరించుకోవాలి తప్ప గవర్నర్ జోక్యం తగదని సుప్రీంకోర్టు తీర్పును వెలువరించింది. పార్టీ విభేదాలను ప్రభుత్వంపై రుద్దకూడదని సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. సీజేఐ డీవై చంద్రచూడ్, జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ కృష్ణ మురారి, జస్టిస్ హిమకోహ్లి, జస్టిస్ పీఎస్ నరసింహాతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం తీర్పును వెలువరించింది. అనర్హత నోటీసులను సవాల్ చేస్తూ తొలుత ఏక్‌నాథ్ షిండే సుప్రీంను ఆశ్రయించారు. షిండేతో ప్రమాణ స్వీకారం, బల నిరూపణకు ఆదేశిస్తూ గవర్నర్ చేపట్టిన చర్యను సవాల్ చేస్తూ ఉద్ధవ్ ఠాక్రే సైతం సుప్రీంను

02

# 794.64 టన్నులకు చేరిన బంగారం నిల్వలు

**ముంబై:**

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒక బంగారు గనిలా మారుతోంది, ఏటికేడు బంగారం నిల్వలను పెంచుకుంటోంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో (ఈజ23) కూడా రిజర్వ్ బ్యాంక్ దగ్గర పసిడి రాసులు పెరిగాయి. కేంద్ర బ్యాంక్ దగ్గరున్న బంగారానికి ఈజ23లో మరో 32.22 టన్నులు జత కలిసింది. ఈ పెరుగుదల తర్వాత, 31 మార్చి 2023 నాటికి, ఖీఃఎ దగ్గర ఉన్న మొత్తం బంగారం నిల్వలు 794.64 టన్నులకు చేరాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఈ గణాంకాలను విడుదల చేసింది. 31 మార్చి 2022 (ఈజ22) వరకు, 760.42 టన్నుల బంగారం ఉంది. 31 మార్చి 2023 (ఈజ23) నాటికి ఈ నిల్వ 794.64 టన్నులకు చేరింది కాబట్టి, పసిడి నిల్వల్లో సంవత్సరానికి 4.5 శాతం పెరుగుదల నమోదైంది. 31 మార్చి 2023 వరకు రిజర్వ్ బ్యాంక్ వద్ద మొత్తం 794.64 టన్నుల పసిడిలో.. 437.22 టన్నుల బంగారం విదేశీ బ్యాంకుల్లో భద్రంగా ఉంది. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండ్, బ్యాంక్ ఆఫ్ ఇంటర్నేషనల్ సెటిల్‌మెంట్స్ వద్ద సేఫ్ కస్టడీలో ఆ పసిడి రాసులను భద్రపరిచారు. మిగిలిన 301.10 టన్నుల బంగారం మన దేశంలోని లాకర్లలో ఉంది. రిజర్వ్ బ్యాంక్ వద్ద ఉన్న పసిడి నిల్వల్లో 11.08 టన్నుల డిపాజిట్లు ఉండగా, ఈజ23లో అవి 56.32 టన్నులుగా తేలాయి. మొత్తం నిల్వల్లో వీటిని కూడా కలిపి, పసిడి గణాంకాలను ఆర్‌బీఐ విడుదల చేసింది. విశేషం ఏమిటంటే, భారతదేశంలో బంగారం నిల్వలు పెరిగినప్పటి నుంచి విదేశీ మారక ద్రవ్య నిల్వలు కూడా పెరిగాయి. భారతదేశ విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో

02





## అప్పులపై తప్పుడు ప్రచారం

**అమరావతి**

ఏపీ ఆర్థిక పరిస్థితులపై ప్రతిపక్షాలు తప్పుడు విశ్లేషణలు చేస్తున్నాయని ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి దువ్వూరి కృష్ణ తెలిపారు. కావాలనే ఇలా చేస్తున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై తెలుగుదేశం, కొందరు విశ్లేషకులు తప్పుడు

02

## +84, +62, +60 నెంబర్ల నుంచి కాల్ వస్తే ఎత్తొద్దు

**న్యూఢిల్లీ:**

వాట్సాప్ కాల్ వస్తుంది. ఆ వెంటనే కట్ అవుతుంది. వారం రోజులుగా వాట్సాప్ యూజర్లు ఫేస్ చేస్తున్న ప్రాబ్లమ్ ఇది. +84, +62, +60 ఇంకా మరిన్ని అంతర్జాతీయ నంబర్‌ల నుండి తెలియని కాల్స్ వస్తుండటంతో చాలా మంది అందోళనకు గురవుతున్నారు. ఇవన్నీ ఇథియోపియా, మలేషియా, ఇండోనేషియా, కెన్యా, వియత్నాం దేశాలకు చెందిన కోడ్స్. ఈ కోడ్స్ నుంచి కాల్స్ వస్తే లిఫ్ట్ చేస్తే ఏమౌతుందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.



ఇలాంటి వాట్సాప్ కాల్ నెంబర్లను ఎట్టి పరిస్థితుల్లోనూ స్పందించకూడదని సైబర్ నిపుణులు చెబుతున్నారు. సైబర్ మోసాలకు ఇదోక ఎత్తుగడ అని అంటున్నారు. తెలియని కాలర్ మీ డేటా లేదా డబ్బును దొంగిలించడానికి ఏదైనా మాల్వేర్‌ని ఇంజెక్ట్ చేయవచ్చని చెబుతున్నారు. మీకు ఇలాంటి ఫోన్ కాల్ వస్తే ముందుగా

02

## సెంటు స్థలాల కోసం మరో 268 ఎకరాల అమరావతి భూములు

### ప్రభుత్వం జీవో జారీ

**అమరావతి :**

రాజధాని అమరావతి రైతులకు ఏపీ సర్కార్ మరో షాక్ ఇచ్చింది. ఇప్పటికే ఆర్ - 5 జోన్‌లో (ఖీ-5 జీనీనివ) 1,134 ఎకరాలను పేదలకు ఇళ్ల స్థలాలుగా కేటాయిస్తూ నిర్ణయం తీసుకున్న సర్కార్.. ఇప్పుడు తాజాగా మరికొన్ని ఎకరాలను కేటాయిస్తూ జీవో జారీ చేసింది. అమరావతి రాజధానిలో 268 ఎకరాలను కేటాయిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. గురువారం ఉదయం పురపాలక శాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ వై.శ్రీలక్ష్మి ఈ జీవోను జారీ



02

ప్రజా తపన
prajathapana.com

# 8 నుంచి 16కు వందే భారత్ బోగీలు

**తిరుపతి:**

సికింద్రాబాద్ – తిరుపతి మధ్య రాకపోకలు సాగించే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు విషయంలో రైల్వే శాఖ శుభవార్త చెప్పింది. ఆ రైలుకు ప్రస్తుతం ఉన్న కోచ్‌లను రెట్టింపు చేయాలని నిర్ణయించారు. సికింద్రాబాద్ – తిరుపతి వందేభారత్ రైలుకు అత్యధిక డిమాండ్ ఉండడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం ఎనిమిది కోచ్‌లతో ఈ సెమీ–హైస్పీడ్ రైలు నడుస్తుంది. ఈ కోచ్ ల సంఖ్యను 16కు పెంచనున్నారు. అయితే, వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో కోచ్‌ల సంఖ్య పెంచాలని అభ్యర్థనలు కూడా వచ్చాయి. ఈ విషయంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చొరవ తీసుకొని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్, దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్‌తో చర్చించారు. మొత్తానికి కోచ్ ల సంఖ్య పెంచుతామని అంగీకరించడంతో కిషన్ రెడ్డి ప్రధాని నరేంద్ర మోదీ, రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌లకు కృతజ్ఞతలు తెలుపుతూ ట్వీట్ కూడా చేశారు. ప్రస్తుతం 8 కోచ్ లతో నడుస్తున్న సికింద్రాబాద్ – తిరుపతి వందే భారత్ ఎక్స్‌ప్రెస్ లో 120 నుంచి 130 శాతం మేర ఆక్యుపెన్సీ రేషియో ఉంటోంది. చాలా మంది ప్రయాణికులకు రిజర్వేషన్లు కూడా దొరకట్లేదు. ఈ రైలులో వెళ్లాలనుకున్నా కుదరడం లేదు. తాజాగా రైల్వే బోర్డు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో కోచ్‌లను రెట్టింపు చేసేందుకు అంగీకరించింది.ఏప్రిల్ 9 నుంచి అందుబాటులోకి వచ్చిన సికింద్రాబాద్ – తిరుపతి వందే భారత్ రైలు వారంలో 6 రోజులు నడుస్తుంది. ఈ రైలును ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఏప్రిల్ 8న ప్రారంభించారు. తెలంగాణ, ఏపీకి చెందిన ప్రయాణికులు తిరుపతి పుణ్యక్షేత్రానికి అత్యంత వేగంగా చేరుకునేందుకు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ అందుబాటులోకి వచ్చింది. ఈ రైలు మంగళవారం తప్ప ప్రతి రోజూ రాకపోకలు సాగిస్తుంది. సికింద్రాబాద్ నుంచి తిరుపతికి ప్రయాణ సమయం 8.30 గంటలు అని రైల్వే అధికారులు తెలిపారు.

సికింద్రాబాద్‌లో 11.30 గంటలకు ప్రారంభమై తిరుపతి 21.00 గంటలకు చేరుతుంది. ఆ మరుసటి రోజు నుంచి తిరుపతి నుంచి సికింద్రాబాద్‌కు వచ్చే రైలులో ప్రయాణికులను అనుమతిస్తారు. సికింద్రాబాద్ – తిరుపతి రైలు నెంబరు 20701. సికింద్రాబాద్‌లో ఉదయం 6 గంటలకు రైలు ప్రారంభం అవుతుంది. తిరుపతికి మధ్యాహ్నం 14.30 గంటలకు చేరుతుంది. తిరుపతి – సికింద్రాబాద్ రైలు నెంబరు 20702.

**సికింద్రాబాద్ - తిరుపతి మధ్య స్టాపులు ఇవే**

నల్గొండ 07.19, గుంటూరు 09.45, ఒంగోలు 11.09, నెల్లూరు 12.29

తిరుపతిలో మధ్యాహ్నం 15.15కు రైలు ప్రారంభం అవుతుంది. సికింద్రాబాద్‌కు రాత్రి 23.45 గంటలకు చేరుతుంది.

**మధ్యలో స్టాపులు ఇవీ**

నెల్లూరు 17.20, ఒంగోలు 18.30, గుంటూరు 19.45, నల్గొండ 22.10

వందేభారత్ రైలును పూర్తిగా ఇండియాలోనే తయారీ చేస్తున్నారు. దీన్ని సెమీ హై స్పీడ్ ట్రైన్‌గా పిలుస్తున్నారు. వందేభారత్‌కు ప్రత్యేక ఇంజిన్ ఉండదు. ఇందులో ఆటోమేటిక్ డోర్లు, ఏసీ చైర్ కార్ వంటివి ఉంటాయి. తక్కువ విద్యుత్తును వినియోగించుకునేలా వీటిని అభివృద్ధి చేస్తున్నారు. ఈ రైళ్లను స్టీల్‌తో కాకుండా తక్కువ బరువు ఉండే అల్యూమినియంతో రూపొందిస్తున్నారు. వందే భారత్ ట్రైల్ రన్స్ సక్సెస్ అవుతుండటంతో.. త్వరలో వాటిని దేశవ్యాప్తంగా ప్రవేశపెడుతారు. ఇవి ప్రయాణ సమయాన్ని భారీగా తగ్గించనున్నాయి. దేశంలో 400 వందే భారత్ రైళ్లను ప్రవేశపెట్టనున్నట్లు గత కేంద్ర బడ్జెట్ లో నిర్మలా సీతారామన్ ప్రకటించారు.

# సీపీఐ, బీఆర్ఎస్ మైత్రికి నారాయణ చెక్ పెట్టినట్టేనా

**హైదరాబాద్ :**

తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఆయన మాటలు తూటాల్లా పేలుతుంటాయి. నచ్చితే ఆకాశానికి ఎత్తేయడం, నచ్చకుంటే కడిగేయడం ఆయన నైజం. అలాంటి సీపీఐ జాతీయ కమిటీ సభ్యుడు కె.నారాయణకు ఇప్పుడు సొంత పార్టీ తీసుకున్న ఓ నిర్ణయం నచ్చనట్లుంది. అందుకే టచ్ మీ నాట్ అన్నట్టుగా ఉంటున్నారట. నారాయణకు తెలంగాణ రాజకీయాలపై పూర్తి అవగాహన ఉంది. చిత్తూరు జిల్లాకు చెందిన వ్యక్తి అయినా? తెలంగాణ ఉద్యమానికి పార్టీని ఒప్పించిన నేత. అయితే ప్రస్తుతం తెలంగాణలో కమ్యూనిస్టుల రాజకీయ విధానాలపై ఆయన అసంతృప్తి ఉన్నట్టు కనిపిస్తోంది. స్మశానాల ప్రైవేటీకరణ, చెప్పులపై జీఎస్టీలను నిరసిస్తూ?ఇటీవల పంజాగుట్ట శ్మశానానికి పాదయాత్ర నిర్వహించ –రా యన. అదే సందర్భంలో బీఆర్ఎస్‌తో కమ్యూనిస్టుల మైత్రి అంశం చర్చకు వచ్చిందిహైదరాబాదులో ఉన్న స్మశాన వాటికల్ని కూడా ప్రభుత్వం ప్రైవేటీకరణ చేస్తోందని తప్పుపడుతూనే సచివాలయంలోకి ప్రతిపక్ష నాయకులు వెళ్ళకుండా అడ్డుకోవడమేంటంటూ సీరియస్ కామెంట్లే చేశారు నారాయణ. ఈ క్రమంలోనే సీపీఐ, బీఆర్ఎస్ మైత్రికి సంబంధించిన ప్రశ్నలు మీడియా వైపు నుంచి రావడంతో అసహనానికి గురయ్యారాయన. మేం ఎవరితో రాజకీయ మైత్రిలో లేమంటూనే తెలంగాణలో పార్టీ తీసుకున్న నిర్ణయాలపై ఆ నాయకత్వాన్నే అడగండి అంటూ వెళ్లిపోయారు. మునుగోడు ఉప ఎన్నిక తర్వాత లెఫ్ట్, బీఆర్ఎస్ మధ్య బంధం బలపడింది. గులాబీ పార్టీతో కలిసి పనిచేయడానికి కామ్రేడ్స్ సిద్ధంగా ఉన్నట్టు సంకేతాలిచ్చారు. ఇది నారాయణకు నచ్చనట్టుంది అంటున్నాయి పార్టీ వర్గాలు. అందుకే మైత్రికి సంబంధించిన అంశాలపై కామెంట్ చేయడానికి ఆయన అంత సుముఖంగా లేరన్న వాదన వినిపించింది.ఒకవైపు ప్రభుత్వాన్ని నిందిస్తూనే ఎన్నికల సమయంలో కాపాడే విధంగా మద్దతు ఏంటన్న అంశంపై కమ్యూనిస్టు పార్టీల్లోనే భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. సమస్యలపై పోరాటం చేస్తూనే తీరా ఎన్నికల టైం వచ్చేసరికి బీజేపీని కారణంగా చూపి బీఆర్ఎస్‌కు మద్దతు ఇవ్వడంపై కూడా చర్చ నడుస్తోంది. అందుకే దీనిపై నారాయణ అంటీ ముట్టనట్టుగా స్పందించారట. స్థానికంగా ఎవరితో కలిసి పనిచేయాలో నిర్ణయించుకునే అధికారాన్ని రాష్ట్ర నాయకత్వాలకు ఇచ్చింది జాతీయ పార్టీ. కాబట్టి ఇక్కడ ఏ నిర్ణయం తీసుకున్నా తాను స్పందించకూడదనుకున్నారో? లేక స్పందించకుండా? తన మనసులో మాటను చెప్పకనే చెప్పాలనుకున్నారో గానీ? బీఆర్ఎస్ విషయంలో నారాయణ వ్యవహారశైలి మాత్రం చర్చనీయాంశమైంది. సాధారణంగా మనసులో మాటను కుండబద్దలుకొట్టేస్తూ సీతయ్యగా పేరుపడ్డ నారాయణ మధ్యే మార్గంగా మాట్లాడటమే ఇప్పుడు హాట్ టాపిక్.

# ఎల్లారెడ్డిలో ప్రచారం ప్రారంభించేశారోచ్..

**నిజామాబాద్:**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పొలిటికల్ హీట్ అంతకంతకూ ఎక్కువ అవుతోంది. ఇంకా సాధారణ ఎన్నికలకు 6 నెలల గడువు ఉండటంతో.. ఇప్పటి నుంచే బరిలోకి నిలవాలనుకుంటున్న అభ్యర్థులు చాప కింద నీరులా తమ పని చక్కబెట్టుకుంటున్నారు. గత ఎన్నికల్లో ఎల్లారెడ్డి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి జాజుల సురేందర్ గెలుపొందారు. ఉమ్మడి జిల్లాలో 9 నియోజకవర్గాల్లో 8 అప్పటి టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు గెలిస్తే... కాంగ్రెస్ నుంచి ఒక్కరే జాజుల సురేంధర్ గెలిచి ఔరా అనిపించారు. ఆ తర్వాత జాజుల కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెప్పి కారెక్కారు. ఎల్లారెడ్డిలో కాంగ్రెస్ పార్టీకి మంచిపట్టుంది. క్యాడర్ బలంగా ఉన్నారు. జాజుల సురేందర్ రెడ్డి పార్టీ మారటంతో నియోజకవర్గంలో కాంగ్రెస్ వ్యవహారాలు సుభాష్ రెడ్డి చూస్తున్నారు. అయితే ఇతర నేతలూ బలంగా ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఈ నియోజకవర్గంలో హస్తం పార్టీలో ప్రస్తుతం ట్రయాంగిల్ వార్ నడుస్తోంది. గత పార్లమెంట్ ఎన్నికల్లో జహీరాబాద్ నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మధుసూధన్ రావు... ఈ సారి ఎల్లారెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్ లో కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలోకి దిగాలని నిర్ణయించుకున్నారు. స్టార్టింగ్ నుంచి ఎల్లారెడ్డి నియోజకవర్గంలో మధుసూధన్ రావు పార్టీ కార్యక్రమాలు చేస్తూ వస్తున్నారు. ఇది మింగుడు పడక మాజీ మంత్రి షబ్బీర్ అలీ, సుభాష్ రెడ్డి ఇతర కాంగ్రెస్ లీడర్లు మదుసూధన్ రావు వైఖరిని వ్యతిరేకిస్తున్నారు. మదన్ మోహన్ రావు పై గతంలో పీసీసీకి ఫిర్యాదులు కూడా చేశారు. ఓవైపు కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మాజీ మంత్రి షబ్బీర్ అలీ కొడుకును ఎల్లారెడ్డి నుంచి బరిలోకి దింపాలని ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. షబ్బీర్ అలీ కామారెడ్డి నుంచి పోటీ చేసేందుకు రెడీ అవుతున్నట్లు సమాచారం. ఈ ఒక్క నియోజకవర్గంపై కాంగ్రెస్ పార్టీలోనే ముగ్గురు నాయకులు టికెక్ తమకంటే తమకే ఇవ్వాలంటూ అటు అధిష్టానంపై కూడా ఒత్తిడి తీసుకోస్తున్నట్లు సమాచారం. సుభాష్ రెడ్డి రేవంత్ వర్గంగా ముద్రపడింది. ఎలాగైనా టికెట్ తనకే లభిస్తుందన్న ధీమాలో ఆయన ఉన్నారు. మరోవైపు మధుసూధన్ రావు గత ఎంపీ ఎన్నికల్లో కేవలం 5 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. కాంగ్రెస్ అధిష్టానం తనకే టికెట్ ఇస్తుందన్న నమ్మకంతో ఉన్నారాయన. ఇటు మాజీ మంత్రి షబ్బీర్ అలీ తన సీనియారిటీ ఉపయోగించి కొడుక్కు ఎల్లారెడ్డి నుంచి టికెట్ ఇప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఎల్లారెడ్డి నియోజకవర్గం కాంగ్రెస్ లో గ్రూపులుగా ఏర్పడి నాయకులు పోటాపోటీ కార్యక్రమాలు చేస్తున్నారు. ఇక్కడ కాంగ్రెస్ లో ట్రయాంగిల్ వార్ కొనసాగుతోంది.బీఆర్ఎస్ పార్టీ నుంచి ప్రస్తుతం సిట్టింగ్ ఎమ్మెల్యే జాజుల సురేందర్ ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో జాజుల బీఆర్ ఎస్ నుంచి పోటీ చేసేందుకు రెడీ అవుతున్నారు. గతంలో బీఆర్ ఎస్ నుంచి గెలిచిన ఏనుగు రవీంధర్ రెడ్డి ప్రస్తుతం బీజేపీ పార్టీలో ఉన్నారు. బీజేపీ లో ఎల్లారెడ్డి నుంచి టికెట్ ఆశిస్తున్న వారిలో బాణాల లక్ష్మారెడ్డి, ఏనుగు రవీందర్ రెడ్డి ఉన్నారు. బాణాల లక్ష్మారెడ్డి గత ఎన్నికల్లో బీజేపీ తరపున జహీరాబాద్ నుంచి ఎంపీగా పోటీ చేసి ఓడిపోయారు. ఈ సారి ఆయన ఎల్లారెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్ నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈటెల రాజేందర్ తో బీజేపీలోకి వెళ్లిన ఏనుగు తనకే టికెట్ కావాలంటూ ఒత్తిడి తీసుకొస్తున్నట్లు సమాచారం. ఒక వేళ ఏనుగు రవీందర్ రెడ్డికి బీజేపీలో టికెట్ ఇవ్వకుంటే బీఆర్ఎస్ లో చేరి అసెంబ్లీ నుంచి పోటీ చేసేందుకూ వెనకాడరంటూ ప్రచారం జరుగుతోంది. మరోవైపు మధుసూధన్ రావుకు కూడా ఒక వేళ కాంగ్రెస్ నుంచి టికెట్ దక్కకుంటే బీజేపీలో చేరి పోటీ చేసేందుకు సైతం స్కెచ్ వేస్తున్నట్లు ఎల్లారెడ్డి నియోజకవర్గం పొలిటికల్ సర్కిల్ లో చర్చ జరుగుతోంది. ప్రస్తుతం మూడు ప్రధాన పార్టీలు ఇటు బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ లో అభ్యర్థులు ఎవరన్నదానిపై జోరుగా చర్చ మొదలైంది. ఇటు ఆయా పార్టీల క్యాడర్ కూడా కన్ఫ్యూజన్ లో ఉన్నారు. ప్రధాన పార్టీలు సైతం ఈ నియోజకవర్గంపై ప్రత్యేక ఫోకస్ చేసినట్లు తెలుస్తోంది.

# రేవంత్ వర్సెస్ తలసాని

**హైదరాబాద్ :**


తెలంగాణ పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ల మధ్య పిసుకుడు చాలెంజ్ ప్రారంభమయింది. కాంగ్రెస్ యువ సంఘర్షణ సభలో ప్రియాంకగాంధీ యూత్ డిక్లరేషన్ ప్రకటనపై స్పందించేందుకు మంగళవారం ప్రెస్ మీట్ పెట్టిన తలసాని శ్రీనివాస్ యాదవ్ రేవంత్ రెడ్డిపైనా విమర్శలు గుప్పించారు. “ఓ పొట్టోడు ఎమ్మెల్యేలను, మంత్రులను అందరినీ వాడు, వీడు అని మాట్లాడుతుండు. పెద్ద పెద్ద మాటలు మాట్లాడు తుందు.. పిసికితే పాణం పోతది’’’ అని పరోక్షంగా రేవంత్‌రెడ్డినుద్దేశించి తలసాని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడి?యాలో వైరల్ అయ్యాయి. తలసాని చేసిన కామెంట్లు దుమారం రేపడంతో . రేవంత్ రెడ్డి కూడా స్పందించారు. తలసానిని దున్నపోతుతో పోల్చి తీవ్ర విమర్శలు చేశారు. దున్నపోతులతో తిరిగిన దున్నపోతు తలసాని శ్రీనివాస్‌యాదవ్ అని, మొదట్నుంచి పశువుల పేడ పిసుక్కున్న అలవాటు తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఉందని, అందుకే పిసుకుడు గురించి మాట్లాడుతున్నాడని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సెటైర్ వేశారు. అరటిపండ్ల బండి దగ్గర మేక నమిలినట్టు గుట్కాలు నమిలే వ్యక్తులు కూడా తన గురించి మాట్లాడే వాళ్ళేనా అని ప్రశ్నించారు. తలసాని శ్రీనివాస్‌యాదవ్ కు అంత పిసుకుడు కోరిక ఉంటే,ఎక్కడికి ఎప్పుడు రావాలో చెబితే తాను వస్తానని,అప్పుడు ఎవరు ఏం పిసుకుతారో అర్థమవుతుందని సవాల్ చేశారు. కేసీఆర్ కాళ్ళు పిసికినట్టు అనుకుంటు న్నారేమో రేవంత్ రెడ్డిని పిసకటం అంటూ మండిపడ్డారు. మాట్లాడేటప్పుడు ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడాలని రేవంత్ రెడ్డి హెచ్చరించారు. తాను ఒక ప్రధాన ప్రతిపక్ష పార్టీకి రాష్ట్ర అధ్యక్షుడిని అని పేర్కొన్న రేవంత్ రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్ జీవితకాలం కేసీఆర్ చెప్పులు మోసిన, కేటీఆర్ సంక నాకినా ఈ స్థాయికి రాలేరని తేల్చిచెప్పారు. ఇంకా ఏదైనా మోజుంటే, మోజు తీర్చుకోవాలంటే తాను వస్తానని రేవంత్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ కు తేల్చి చెప్పారు. రేవంత్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేయడంతో తలసాని కూడా స్పందించే అవకాశం ఉంది. ఇద్దరూ ఒకప్పుడు టీడీపీలో కలిసి పని చేసిన వారే. 2014లో ఇద్దరూ టీడీపీ నుంచి గెలిచారు. తర్వాత తలసాని టీఆర్ఎస్‌లో చేరి మంత్రి అయ్యారు. అప్పట్లో కూడా రేవంత్ రెడ్డి, తలసాని మధ్య ఘాటు విమర్శలు చోటు చేసుకునేవి. ఇప్పుడు మరోసారి..తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆయనను పిసికిస్తానని చేసిన వ్యాఖ్యలతో మరోసారి దుమారం ప్రారంభమయింది.

# ఇక ఇంటర్‌లోనూ ‘గ్రేడ్’ విధానం ?

**ప్రవేశాలకు ‘ఆన్‌లైన్’ యోచనలో ప్రభుత్వం!**

**హైదరాబాద్**

తెలంగాణలో పదోతరగతి తరహాలోనే ఇంటర్‌లోనూ మార్కులకు బదులు గ్రేడింగ్ విధానాన్ని అమలుచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు సాధ్యాసాధ్యాలపై సమాలోచనలు చేస్తోంది.తెలంగాణలో పదోతరగతి తరహాలోనే ఇంటర్‌లోనూ మార్కులకు బదులు గ్రేడింగ్ విధానాన్ని అమలుచేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు సాధ్యాసాధ్యాలపై సమాలోచనలు చేస్తోంది. మార్కుల పోటీతో విద్యార్థులపై తీవ్ర ఒత్తిడి ఉండడం, పలువురు ఆత్మహత్యకు పాల్పడుతున్న నేపథ్యంలో గ్రేడ్ పాయింట్ యావరేజ్(జీపీఏ) ఇస్తే కొంతవరకైనా మానసిక ఒత్తిడి తగ్గుతుందని భావిస్తోంది. కొన్నేళ్ల నుంచి జేఈఈ మెయిన్, నీట్ ర్యాంకుల్లో ఇంటర్ మార్కులకు వెయిటేజీ లేదు. ఈసారి నుంచి ఎంసెట్‌కూ శాశ్వతంగా వెయిటేజీ తొలగించారు. ఈ క్రమంలో ఇంటర్‌లో మార్కుల బదులు గ్రేడ్లు ఇస్తే మన విద్యార్థులకు ఇతర రాష్ట్రాల్లో ఉన్నత విద్యా కోర్సుల్లో ప్రవేశాలకు ఏమైనా సమస్య వస్తుందా? తదితర అంశాలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించేందుకు నిపుణుల కమిటీని నియమించాలని భావిస్తోంది.ఇంటర్ విద్య ఐక్య కార్యచరణ ఛైర్మన్ డాక్టర్ పి.మధుసూదన్ రెడ్డి ఈ విషయంపై స్పందిస్తూ.. రాష్ట్ర, జాతీయ ప్రవేశ పరీక్షల్లో ఇంటర్ మార్కులకు వెయిటేజీ లేదని చెప్పారు. ఎన్ఐటీలు, ఐఐటీల్లో చేరేటప్పుడు కనీసం 75% మార్కులు అడుగుతారని, అలాంటప్పుడు కొన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో దోస్త్ ద్వారా డిగ్రీ ప్రవేశాలకూ ఇంటర్ మార్కులే ఆధారంగా ఉన్నందున నిపుణుల కమిటీ వేస్తే ఏదో ఒక పరిష్కారం లభిస్తుందని ఆయన తెలిపారు. ఇప్పుడు ఇంటర్ మార్కుల కంటే జేఈఈ, నీట్ ర్యాంకులు వస్తాయో?రావో? అన్న దానిపైనే అధికంగా ఒత్తిడి ఉంది అని నానో అకాడమి సంచాలకుడు కృష్ణ చైతన్య అభిప్రాయంవ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఇంటర్మీడియట్ ప్రవేశాలను 2024–25 విద్యాసంవత్సరం నుంచి ఆన్‌లైన్ విధానం ద్వారా చేపట్టే యోచన చేస్తున్నామని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ తెలిపారు. ఇంటర్ ఫలితాల వెల్లడి సందర్భంగా వీరు విలేకర్లతో మాట్లాడారు. ఇంటర్ ప్రవేశాల్లో అక్రమాలకు చెక్ పెట్టేందుకు ఆన్‌లైన్‌లో ప్రవేశాలు జరుపుతారా అని ప్రశ్నించగా... ఈసారికి పాత పద్ధతిలోనే నిర్వహిస్తామని, ఆపై వచ్చే విద్యాసంవత్సరంలో ఆన్‌లైన్ విధానంలో ప్రవేశాలు కల్పించేందుకు యోచిస్తున్నామన్నారు. జూన్ 1 నుంచి ఇంటర్ రెండో సంవత్సరంతో పాటు తొలి ఏడాది విద్యార్థులకు కూడా తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. త్వరలో ప్రవేశాల షెడ్యూల్ జారీ చేస్తామని, మరో నాలుగైదు రోజుల్లో ప్రైవేట్ కళాశాలలకు అనుబంధ గుర్తింపు ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ కళాశాలలతో పాటు కొన్ని ప్రైవేట్ కళాశాలలకు అనుబంధ గుర్తింపు ఇచ్చామన్నారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనాన్ని ఆన్‌లైన్ విధానంలో చేస్తారా అని ప్రశ్నించగా..



దానిగురించి తర్వాత మాట్లాడదామని మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రంలో దాదాపు 400 కళాశాలలకు అగ్నిమాపక ఎన్‌ఓసీ లేదని, కాకపోతే వచ్చే విద్యాసంవత్సరం(2023–24) వరకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతి ఇచ్చిందని నవీన్ మిట్టల్ తెలిపారు. ఆ కళాశాలల్లో చేరే విద్యార్థులు వాటికి ఎన్‌ఓసీ లేదన్న విషయం తెలుసని హామీపత్రం తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుందని పేర్కొన్నారు.పదిలోనూ ఆన్‌లైన్ మూల్యాంకనం!పదోతరగతి జవాబుపత్రాల మూల్యాంకనంలో కూడా ఆన్‌లైన్ విధానాన్ని (ఆన్‌స్క్రీన్ ఎవాల్యుయేషన్) అమలు చేయాలని పాఠశాల విద్యాశాఖ యోచిస్తోంది. ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని, ఆలోచన చేస్తున్నామని పాఠశాల విద్యాశాఖ సంచాలకురాలు శ్రీదేవసేన తెలిపారు. అదనపు జవాబుపత్రాలు తీసుకుంటే ఇంటర్ తరహాలో బుక్‌లెట్‌గా ఇవ్వాలని, ఆన్‌లైన్ విధానాన్ని అమలు చేయాలంటే అది తప్పనిసరని అన్నారు.

# రేషన్ డీలర్లు సమ్మె ఆలోచన విరమించుకోవాలి

**హైదరాబాద్**

రాష్ట్రంలో అన్నార్థులు ఉండొద్దని, ఏ ఒక్కరూ ఆకలితో అలమటించకూడదనే గొప్ప సంకల్పంతో కేసీఆర్ సర్కార్ పేదలకు రేషన్ పంపిణీ చేపడుతుందని, సంవత్సరానికి వేలకోట్లను వెచ్చిస్తూ నాణ్యమైన పోషకాల బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ రేషన్ దారులకు ఇబ్బందులు రానివ్వద్దని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ సూచించారు. ఈమేరకు రేషన్ డీలర్ల సమస్యలపై నేడు హైదరాబాద్లోని తన అధికారిక నివాసంలో పౌరసరఫరాల కమిషనర్ వి.అనిల్ కుమార్ ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు.

దాదాపుగా ప్రతీనెల 90 లక్షల కార్డులకు చెందిన 2కోట్ల 82లక్షల 60వేల మందికి 1.80 ఎల్ఎంటీలు కేటాయిస్తూ వీటికోసం 298 కోట్లు ఖర్చుచేస్తున్నామని, ఏటా 3580 కోట్లు రేషన్ కోసం ప్రభుత్వం ఖర్చుచేస్తుందన్నారు. రాష్ట్రంలో ప్రస్థుతం 17,220కు పైగా రేషన్ షాపులను నిర్వహిస్తున్నామని ఈ డీలర్లందరికీ నెలకు 12 కోట్ల పైచీలుకు కమిషన్ రూపంలో అందజేస్తున్నామన్నారు. ఇప్పటికే పలుదపాలుగా రేషన్ డీలర్లతో చర్చించామని, వారి ప్రధాన సమస్యల పరిష్కారంపై కసరత్తు చేయాలని అదికారులను ఆదేశించారు. ఈనెల 22న రేషన్ డీలర్ల సంఘాలతో సమావేశమవుతామని, సమ్మె ఆలోచన విరమించుకోవాలని డీలర్లకు మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రితో పాటు పౌరసరఫరాల కమిషనర్ వి.అనిల్ కుమార్తో పాటు అధికారులు ఉషారాణి, లక్ష్మీభవాని తదితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి సేవలో ఏపి మంత్రి ఉషశ్రీ చరణ్

**తిరుమల**

తిరుమల శ్రీవారిని ఏపి మంత్రి ఉషాశ్రీ చరణ్ దర్శించుకున్నారు.. గురువారం ఉదయం ఉషాశ్రీ చరణ్ స్వామి వారి విఐపి విరామ సమయంలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.. దర్శనంతరం మంత్రి ఉషాశ్రీ చరణ్ కి ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వాదం అందించగా, ఆలయ అధికారులు పట్టు వస్త్రంతో సత్కరించి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.. అనంతరం ఆలయ వెలుపలకు వచ్చిన ఆమె మీడియాతో మాట్లాడుతూ.. శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు.. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, మళ్ళీ ఏపి సీఎంగా జగన్మోహన్ రెడ్డి ఉండాలని స్వామి వారిని ప్రార్థించినట్లు ఆమె తెలిపారు.. 2024లో ఖచ్చితంగా తాను ఎన్నికల బరిలో దిగుతూన్నట్లు ప్రకటించారు.. రాబోవు ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తారని ఉషాశ్రీ చరణ్ జోస్యం చెప్పారు..

## బోధన్ లో ఫ్లెక్సీల కలకలం

**నిజామాబాద్**

నిజామాబాద్ జిల్లా బోధన్ లో ఫ్లెక్సీలు కలకలం రేపాయి. ఎమ్మెల్యే షకీల్ కు వ్యతిరేఖంగా ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు వెలసాయి. తడిసిన ధాన్యం కొంటానని చెప్పి 20 రోజులుగా అదృశ్యం అయ్యాడంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసారు. షకీల్ అడ్రస్ ఎక్కడ అని రైతుల పేరుతో బీజేపీ నేతలు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసినట్లు బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు. ఫ్లెక్సీలు చించివేసారు. తరువాత పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసారు.

## ఆటో, బైకు ఢీ..పలువురికి గాయాలు

**అనకాపల్లి**

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం నక్కపల్లి వద్ద రోడ్డు ప్రమాదం తృటిలో తప్పింది. అడ్డురోడ్డు నుండి తుని వైపు వెళున్న ఆటో ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఆ ఆటో ఎదురుగా ఉన్న బైక్ ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ పై వెళున్న ఒకే కుటుంబానికి చెందిన నలుగురిలో ఇద్దరికి స్వల్ప గాయలు అయ్యాయి. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా మారింది. వారిని అనకాపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఆటో లో ప్రయాణిస్తున్న 10 మందిలో ముగ్గరి పరిస్థితి విషమంవుంది. ఏడుగురికి గాయాలు అయ్యాయి. నక్కపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. స్థానిక ఎస్సై శిరిష టోల్ ప్లాజా వద్ద గుర్తు తెలియని వాహనం పై ఆరా తీసారు.

## సర్వీస్ రోడ్డు కోసం అందోళన

**నిజామాబాద్**

నిజామాబాద్ జిల్లా డిచిపల్లి శివారులో సర్వీస్ రోడ్డు వేయాలంటూ జాతీయ రహదారిపై స్థానికులు ఆందోళనకు దిగారు. నాలుగు గ్రామాల నుండి ప్రజలు తరలివచ్చారు. అందోళనకారులు హైవే రోడ్డు పైకి వెళ్లే క్రమంలో వారిని పోలీసులు అడ్డుకున్నారు. సర్వీస్ రోడ్డు నిర్మించక పోవడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయంటూ వారు ఆవేదన వ్యక్తం చేసారు. అందోళన ను అడ్డుకోవడంతో నిరసనకారులు, పోలీసులకు వాగ్వాదం రేగింది.

## చలివేంద్రాన్ని సద్వినియోపరుచుకోవాలి

**కాకినాడ**

వేసవి నుండి ప్రజల దాహార్తిని తీర్చడానికి ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని బాటసారులు సద్వినియోపరుచుకోవాలని డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేట రాయుడుపాలెంలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన చలివేంద్రాన్ని డాక్టర్ అడ్డాల గురువారం ప్రారంభించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండే ఎండలో దాహంతో ఉన్న బాటసారులకు చల్లని మజ్జిగ లేదా మంచినీరు అందించడం ఎంతో ఉపయుక్తమని అన్నారు. ట్రస్ట్ చైర్మన్ అడబాల రత్న ప్రసాద్ మాట్లాడుతూ రోడ్డు వెంబడి రాకపోకలు సాగించే బాటసారు లకు చలివేంద్రం ఎంతో ఊరట నిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శిరీష, డాక్టర్ కుమార్ యాదవ్, ఎస్. శ్రీ నగేష్, రాజా, అడబాల సత్యనారాయణ, చింతపల్లి సుబ్బారావు, సత్యనారాయణ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## ఐశ్వర్య మృతదేహానికి మంత్రి నివాళులు

**హైదరాబాద్**

అమెరికాలోనీ టెక్సాస్ సమీపంలో ఉన్న డల్లాస్ లో దుండగుడు జరిపిన కాల్పుల్లో మృతి చెందిన ఐశ్వర్య రెడ్డి మృతదేహానికి రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి పూల మాల వేసి నివాళులర్పించారు. అయన వెంట శాసనసభ్యులు గాధరి కిశోర్ కుమార్, శానంపూడి సైదిరెడ్డి తదితరులు వున్నారు. అమెరికాలోనీ టెక్సాస్ సమీపంలో ఉన్న డల్లాస్ లో ఉన్నత విద్యానభ్యసిస్తున్న ఐశ్వర్య రెడ్డి ఆచూకీ కనిపించడం లేదంటూ కుటుంబ సభ్యులు మంత్రి జగదీష్ రెడ్డి దృష్టికి తీసుకు వచ్చారు. గ తక్షణం స్పందించిన మంత్రి జగదీష్ రెడ్డి అమెరికా కాన్సులేట్ తో సంప్రదింపులు జరిపి ఆచూకీ కనుగొనడం తో పాటు జరిగిన ఘోరం తెలియడంతో, మంత్రి జగదీష్ రెడ్డి విషయాన్ని మంత్రి కేటీఆర్ దృష్టికి తోసుకువచ్చారు. ఐశ్వర్య రెడ్డి పార్థివ దేహాన్ని స్వస్థలానికి చేర్చేందుకు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే గురువారం నగరానికి చేరుకున్న ఐశ్వర్య రెడ్డి పార్థివ దేహాన్ని సందర్శించిన మంత్రి జగదీష్ రెడ్డి శాసనసభ్యులు గాధరి కిశోర్ కుమార్ ,శానంపూడి సైదిరెడ్డి లతో కలసి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## వైసీపీ ప్రభుత్వంలో హజ్ యాత్రికులకు అన్యాయం జరుగుతోంది

**కుప్పం**

వైసీపీ ప్రభుత్వం మక్కా వెళ్ళే హజ్ యాత్రికులకు 85 వేల రూపాయలు విమాన ఛార్జీలు పెంచారని, ధరలు వెంటనే తగ్గించాలని గురువారం కుప్పం పట్టణంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో, ఎన్టీఆర్ విగ్రహం వద్ద ముస్లిం మైనార్టీలు నిరసన కార్యక్రమం చేపట్టారు. హజ్ యాత్రికులకు వైసీపీ ప్రభుత్వంలో అన్యాయం జరిగిందని కుప్పం నియోజకర్గం టీడీపీ మైనార్టీ విభాగం అధ్యక్షుడు జాకీర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.
టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్ బాషా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం హజ్ యాత్ర వెళ్లే మైనార్టీలకు రేట్లు విపరీతంగా పెంచడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనారిటీ విభాగం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# టాప్ 50 వర్శిటీల్లో చదివితేనే

**విజయవాడ :**

జగనన్న విదేశీ విద్యా దీవెన పథకానికి ఏపీ ప్రభుత్వం మరో మెలిక విధించింది. టాప్ 50 ర్యాంకుల్లో ఉన్న వర్శిటీల్లో చదివితేనే ప్రభుత్వ సాయం అందిస్తామని తాజాగా ప్రకటించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉత్తర్వులు వెలువరించగా తాజాగా అవి వెలుగులోకి వచ్చాయి. ఏపీలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత దాదాపు మూడున్నరేళ్ల పాటు విదేశీ విద్యా దీవెన పథకాన్ని నిలిపివేశారు. దీనిపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో కొద్ది నెలల క్రితమే పునరుద్దరించినా రకరకాల ఆంక్షలు విధించడం చాలా మంది పథకానికి దూరం అయ్యారు.రాష్ట్ర ప్రభుత్వ ఆంక్షలతో విదేశీ విద్యా దీవెన పథకానికి పేద కుటుంబాలకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు దూరం అయ్యారు. పథకానికి అర్హులయ్యే వారిని తగ్గించేలా కొత్త మార్గదర్శకాలు జారీ చేశారు. లబ్దిదారుల సంఖ్య మరింత తగ్గిపోయేలా మార్గదర్శకాల్లో సవరణలు చేశారు. విదేశాల్లో ఉన్నత విద్య పథకాన్ని అమలు చేస్తున్నట్లు చూపిస్తూనే,పేదలకు పూర్తి స్థాయిలో అందకుండా నిబంధనల్లో మార్పులు తీసుకొచ్చింది. తాజా ఉత్తర్వులతో విదేశీ విద్య పేద విద్యార్థులకు అందని ద్రాక్షే అవుతుంది.గత ఏడాది పథకాన్ని పున: ప్రారంభించినపుడు క్యూఎస్ ర్యాకింగ్‌లో టాప్ 200లో ఉన్న విశ్వ విద్యాలయాల్లో సీట్లు పొందిన వారికి సాయాన్ని అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. పథకానికి అర్హులైన వారికి గరిష్ట మొత్తంలో ఫీజులు చె?ల్లిస్తామని వెల్లడించింది. తాజా ఉత్తర్వుల్లో సబ్జెక్టుల వారీగా టాప్ 50 ర్యాంకుల్లో ఉన్న వాటికే సాయం ఇస్తామని ఉత్తర్వుల్లో సవరణ చేసింది. సబ్జెక్టుల వారీగా యూనివర్శిటీలను విభజించారు. ఒక్కో సబ్జెక్టుకు పథకానికి అర్హత పొందిన 50 నుంచి 70 విశ్వవిద్యాలయాలను ప్రకటించారు.విద్యార్థులు ఏ సబ్జెక్టులో పీజీ చదవాలనుకుంటున్నారో దానికి ప్రభుత్వం సూచించిన టాప్ 50లో వర్శిటీల్లో మాత్రమే సీటు సంపాదించాల్సి ఉంటుంది. ఈ మేరకు ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మార్గదర్వాకాలను గోప్యంగా ఉంచారు. ప్రభుత్వం నిర్దేశించిన 21 సబ్జెక్టుల్లో టాప్ 50 ర్యాంకుల్లో నిలిచిన విశ్వవిద్యాలయాల్లో సీటు సంపాదించిన వారికి మాత్రమే రాష్ట్ర ప్రభుత్వం తరపున సాయాన్ని అందిస్తామని తెలిపింది.టాప్ 50 ర్యాంకుల్లో నిలిచిని విశ్వవిద్యాలయాల్లో సీటు సంపాదించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 100% ఫీజు లేదా రూ. 1.25 కోట్లు చెల్లిస్తారు. వీటిలో ఏది తక్కువ అయితే అది వర్తిస్తుంది. ఇతర సామాజిక వర్గాలకు చెందిన విద్యార్థులకు 100% ఫీజు లేదా రూ.కోటి వరకు సాయం అందిస్తారు. కొద్ది రోజుల క్రితం జగనన్న విదేశీ విద్యా? దీవెన పథకాన్ని ప్రారంభించిన ప్రభుత్వం అర్హుల జాబితాను మాత్రం విడుదల చేయలేదు.వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి దఫా అర్హుల్లో సామాజిక వర్గాల వారీగా ఏఏ వర్గాలకు విదేశీ విద్య పథకంలో అర్హత సాధించారనే విషయాలను అధికారికంగా వెల్లడించలేదు. 213మంది విద్యార్థులు ఈ పథకానికి ఎంపికయ్యారు. వారికి తొలివిడతో 19.95కోట్ల రుపాయల నిధులను ప్రభుత్వం అంద చేసింది. క్యూఎస్ 200 ర్యాంకింగ్ ఉన్న వర్శిటీల్లో ప్రవేశాలు దక్కడమే గగనమని భావిస్తున్న నేపథ్యంలో టాప్ 50 వర్శిటీలకే పథకాన్ని వర్తింప చేయాలనే ఆలోచనపై అసంతృప్తి వ్యక్తమవుతోంది.

# విజయసాయిరెడ్డికి పూర్వవైభవం..?

**ఒంగోలు:**

వైసీపీలో ఎంపీ విజయ సాయిరెడ్డి మళ్లీ కీలక బాధ్యతలు అప్పగించారు. గత కొద్ది నెలలుగా తాడేపల్లితో పెరిగిన దూరంతో ఢిల్లీకి మాత్రమే పరిమితమైన సాయిరెడ్డికి కీలక బాధ్యతలు అప్పగించడంతో పార్టీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.వైసీపీలో అంతర్గత సమస్యల పరిష్కారం, నాయకుల్ని కట్టడి చేయడం, గ్రూపుల గొడవల్ని దారికి తీసుకురావడంపై ముఖ్యమంత్రి దృష్టి పెట్టారని ఈ నేపథ్యంలోనే సాయిరెడ్డికి మళ్లీ బాధ్యతలు అప్పగించారు. ఎంపీ విజయసాయి రెడ్డికి పార్టీలో మళ్లీ మునుపటి గుర్తింపు వచ్చేస్తుందని ఆయన వర్గం ప్రచారం చేస్తోంది. గత ఏడాది కాలంలో పార్టీలో ఒక్క బాధ్యత నుంచి సాయిరెడ్డిని తప్పిస్తూ వచ్చారు. మొదట ఉత్తరాంధ్ర ఇంఛార్జి బాధ్యతల నుంచి సాయిరెడ్డిని తప్పిం చారు. సాయిరెడ్డి స్థానంలో వైవీ సుబ్బారెడ్డికి ఆ బాధ్యతలు అప్పగించారు. ఉత్తరాంధ్ర బాధ్యతలు తప్పించిన సమయంలో పార్టీ అనుబంధ విభాగాలు సాయిరెడ్డి ఆధ్వర్యంలోనే నడిచేవి.విశాఖ నుంచి వచ్చేసిన తర్వాత కొద్ది రోజుల పాటు తాడేపల్లిలోనే సాయిరెడ్డి మకాం వేశారు. వైసీపీ అనుబంధ విభాగాలతో వరుసగా సమీక్షలు, సమావేశాలు నిర్వహించారు. పార్టీని బలోపేతం చేయడంపై వరుసగా కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆ సమయంలో అనూ హ్యంగా పార్టీ అను బంధ విభాగాలకు కూడా వేరే బాధ్యుల్ని నియమిం చారు. దీంతో సాయిరెడ్డి ఢిల్లీకి పరిమితం కావాల్సి వచ్చింది. పార్టీలో అనుబంధ విభాగాలకు వేర్వేరుగా బాధ్యుల్ని నియమించడంతో తాడేపల్లిలో సాయిరెడ్డికి పని లేకుండా పోయింది .పార్లమెంటు శీతాకాల సమావేశాలకు ముందే సాయిరెడ్డి తాడేపల్లి రావడం తగ్గిఎ ోయింది. గత కొద్ది నెలలుగా సొంత పార్టీ వారి నుంచే సోషల్ మీడియాలో ట్రోలింగ్స్ జరుగుతున్నా కూడా సాయిరెడ్డి పెద్దగా స్పందించలేదు. పార్టీ వ్యవహారాల్లో సజ్జల రామకృష్ణారెడ్డి కీలకం అయ్యారు. పార్టీ నాయకులతో సమావేశాలన్నీ సజ్జల కేంద్రంగానే జరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో జరిగిన పరిణామాల నేపథ్యంలో సాయిరెడ్డి అవసరాన్ని పార్టీ పెద్దలు గుర్తించినట్లు ప్రచారం జరుగుతోంది. కీలకమైన విషయాల్లో కటువుగా వ్యవహరించడం, పార్టీ నాయకుల్ని అదుపులో ఉంచే విషయంలో చకచకా నిర్ణయాలు తీసుకోవడానికి సాయిరెడ్డిని మళ్లీ తెరపైకి తీసుకువస్తున్నట్లు చెబుతున్నారు. ప్రకాశం జిల్లాకు చెందిన బాలినేని శ్రీనివాస రెడ్డి వ్యవహారంలో పార్టీ నేతలు సరిగా వ్యవహరించలేకపోయారని ప్రచారం ఉంది. ముఖ్యమంత్రి ఆదేశాలను అమలు చేసే విషయంలో నేతలు ఊగిసలాటకు గురయ్యారని ఖచ్చితమైన ధోరణి ప్రదర్శించ లేకపోయారని చెబుతున్నారు.ఎన్నికలు మరో ఏడాదిలో జరగనున్న నేపథ్యంలో అందరిని సమ న్వయంతో నడిపించడానికే సాయిరెడ్డిని మళ్లీ పిలిపిస్తున్నట్లు చెబుతు న్నారు. గత వారం ముఖ్యమంత్రి సాయి రెడ్డితో భేటీ అయ్యారని, కొద్దిరోజుల్లోనే పార్టీ వ్యవహారాలపై సాయిరెడ్డి ఎంట్రీపై క్లారిటీ వస్తుందని చెబుతున్నారు. ప్రస్తుతం వైసీపీ ప్రాంతీయ సమన్వయకర్తలందరిని సమన్వయం చేసే బాధ్యతలు ముఖ్య మంత్రి సాయిరెడ్డికి అప్పగించినట్లు తెలుస్తోంది. గతంలో ఉత్తరాంధ్ర వరకే సాయిరెడ్డి పరిమితం కాగా ఇప్పుడు రాష్ట్రం లోని అన్ని ప్రాంతాల్లో నాయకుల్ని సమ న్వయ పరిచే బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది.

# బండారు వర్సెస్ చింతకాయల

**విశాఖపట్టణం:**

ఉమ్మడి విశాఖజిల్లా తెలుగుదేశంపార్టీలో బండారు, చింతకాయల ఫ్యామిలీల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. వారసత్వ రాజకీయ పునాదులపై బలమైన నాయకులుగా ఎదిగారు మాజీ మంత్రులు సత్యనారాయణ మూర్తి, అయ్యన్న పాత్రుడు. ఉత్తరాంధ్రలో కీలకమైన వెలమ సామాజిక వర్గానికి ప్రతినిధులుగా ఆవిర్భావం నుంచి టీడీపీనే నమ్ముకున్న ఈ ఇద్దరు నేతలు సమాన గౌరవం ఆశిస్తుంటారు. అయ్యన్న పొలిట్ బ్యూరో సభ్యుడు కాగా? సత్యనారాయణ మూర్తికి కీలకమైన కాకినాడ, కోనసీమ జిల్లాల సమన్వయ బాధ్యతలు అప్పగించింది పార్టీ. దశాబ్దాల తరబడి ఒకే పార్టీలోఉన్నా.. ఇద్దరూ ఉత్తర దక్షిణ ధృవాలు. ఎవరి నియోజకవర్గ రాజకీయాలు వాళ్ళు చేసుకుంటున్నా.. వ్యక్తిగత ప్రయోజనాలను సాధించుకునే దగ్గర మాత్రం తీవ్రమైన పోటీ ఏర్పడుతుంది. అయితే..ఉమ్మడిజిల్లాపై గట్టిపట్టు ఉన్న అయ్యన్నపాత్రుడి ఆధిపత్యం పార్టీలో కనిపిస్తుంది. రాజకీయ కుటుంబాలతో ఉన్న విస్తృతమైన బంధుత్వాలు బండారుకు అడ్వాంటేజ్ పార్టీ శ్రేణులను ఉత్తేజపరిచే క్రమంలో అయ్యన్న దూకుడు మంచి ఫలితాలను ఇచ్చిందన్న అభిప్రాయం స్థానికంగా ఉంది. అదే సమయంలో మాజీ మంత్రి గంటాశ్రీనివాసరరావు, బండారు సత్య నారాయణమూర్తి ఒక గ్రూప్ అయ్యారు. పార్టీలోనూ? .అధికారంలో వున్నప్పుడూ తనతో సమానమైన అయ్యన్నకు ఎక్కువ అవకాశాలు లభిస్తుండటంపై బండారు తీవ్ర అసంతృప్తితో ఉండేవారట. దీంతో అంతర్గతంగా ఇద్దరు నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనేంత రాజకీయ వైరం నడుస్తుంటుంది. ఐతే, గతంతో పోలిస్తే ఇప్పుడు బండారు బలం, బంధుత్వం పెరిగింది. కారణం. .శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్ నాయకుడికి బండారు స్వయానా మామ. టీడీపీ ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడికి వియ్యంకుడు. ఇవన్నీ పార్టీలో సత్యనారాయణమూర్తికి కలిసివచ్చే అంశాలు. ఇక్కడే అసలు సిసలు పొలిటికల్ డ్రామాకు తెరలేచింది.వచ్చే ఎన్నికలు లక్ష్యంగా వారసుల రాజకీయ ఆరంగేట్రం కోసం అయ్యన్న, బండారు పావులు కదపడం మొదలుపెట్టారు. నర్సీప ట్నం నుంచి తిరిగి పోటీ చేయాలనుకుంటున్న అయ్యన్నపాత్రుడు?. అనకాపల్లి ఎంపీ సీటు తన కుమారుడు విజయ్‌కి ఇవ్వాలని ఒత్తిడి తెస్తున్నారు. ఇందు కోసం ఆయన హైకమాండ్ తో అమితుమీ తేల్చుకోవడానికి సిద్ధం అవుతున్నట్టు తెలిసింది. ఒకవేళ సామాజిక కోణంలో ఎంపీ సీటును కాపులకు కేటాయిస్తే మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి విజయ్‌ని బరిలో దించాలనేది అయ్యన్న ప్లాన్. ఇక్కడే మడత పేచీ మొదలైంది. పెందుర్తిలో తాను, మాడుగులలో తన కుమారుడు అప్పలనాయుడు పోటీ చేయాలని అనుకుంటున్నారట సత్యనారాయణమూర్తి. సీనియర్స్ కుటుంబాలకు రెండు టిక్కెట్లు ఇస్తే తనకూ కావాలని అంటున్నారట ఆయన. స్థానికంగా తనకున్న బలగం, బంధుత్వాన్ని కూడా పరిగణనలోకి తీసుకోమంటున్నారట. దీంతో మాజీమంత్రుల మధ్య విభేదాలు ఇప్పుడు పతాక స్థాయికి చేరినట్టు చెబుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో టీడీపీ ప్రయోగాలు చేసే అవకాశం ఏ మాత్రం లేదని, సిట్టింగ్ ఎమ్మెల్యేలు, సీనియర్లకే సీటు గ్యారెంటీ లేనప్పుడు ఒకే కుటుంబానికి రెండేసి ఎలా సాధ్యమన్న చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. ఈ విషయాలు అటు అయ్యన్నకు, ఇటు బండారుకు తెలియనివి కాదని, ఒకరి ఎత్తుగడలను మరొకరు ప్రభావితం చేసుకునే ప్రయత్నంలో భాగంగానే ఇలాంటి ప్రతిపాదనలు చేసుకుంటున్నారన్నది పార్టీ ఇంటర్నల్ టాక్. బండారు, గంటా వంటి నేతలు ఒక గ్రూప్ గా ఏర్పడి రాజకీయాలు నడుపుతున్నందున అయ్యన్న తన డిమాండ్లను ఎలా సాధించుకుంటారు? దానికి సత్యనారాయణమూర్తి రియాక్షన్ ఎలా ఉంటుందన్నది ఆసక్తికరమైన అంశంగా మారింది.

## మొబైల్ ఫోన్లు రికవరీ

**ఏలూరు**

ఏలూరు జిల్లా తో పాటు ఇతర జిల్లాల్లో అపహరణకు 113 సెల్ ఫోన్ లను సిసిఎస్ పోలీసులు రికవర్ చేసారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి బాధితులకు సెల్ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఏడు విడతలలో కోటి 69 లక్షల 38,184 రూపాయలు విలువచేసే 821 సెల్ ఫోన్ లు రికవరీ చేసామని తెలిపారు.. ఎక్కువగా రద్దీగా ఉన్న ప్రాంతాల్లో, బస్టాండ్లు, రైల్వే స్టేషన్ ల వద్ద సెల్ఫోన్లు అపహరణకు గురవుతున్నాయని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## శ్రీవారి సేవలో వకీల్ సాబ్ ఫేం అనన్య

**తిరుమల**

తిరుమల శ్రీవారిని హీరోయిన్ అనన్య దర్శించుకున్నారు.. ఉదయం స్వామి వారి నైవేద్య విరామ సమయంలో అనన్య స్వామి వారి సేవలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. గురువారం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి నిజరూప దర్శనం చేసుకోవడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు.. తిరుమలకు రావడం చాలా సంతోషాన్ని కలిగిందని, మే నెలలో సర్ప్రైజ్ సినిమా రిజీజ్ కాబోతుందని, ప్రస్తుతం ఐదు సినిమాలో నటిస్తున్నట్లు అనన్య తెలిపారు..

## పది ఫలితాల్లో నలంద హవా

**హైదరాబాద్**

బుధవారం వెలువడిన పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో తమ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం పట్ల నలంద హైస్కూల్ చైర్మన్ మంతెన శ్రీనివాసరాజా సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు వెంగళరావు నగర్ లోని స్కూల్ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పుష్ప గుచ్ఛాలిచ్చి ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో నలంద స్కూల్ డైరెక్టర్ మంతెన సూర్య నారాయణ కాశ్యప్ వర్మ, టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమ మద్యం స్వాధీనం..ఏడుగురు అరెస్టు

**కుత్బుల్లాపూర్**

ఇతర రాష్ట్రాల నుండి అక్రమంగా మద్యం తెచ్చి హైదరాబాద్ లోని పలు ప్రాంతాల్లో విక్రయిస్తున్నారన్న సమాచారంతో మేడ్చల్, కుత్బుల్లాపూర్ ఎక్సైస్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో అక్రమ మద్యం సరఫరా చేస్తున్న ఏడుమందిని అరెస్టు చేసారు. మరో ముగ్గరు పరారీలో వున్నట్లు గుర్తించారు. నిందితులనుంచి నుండి 160 కాటన్స్ ,,వాటి విలువ సుమారు విలువ చేసే 40లక్షల మద్యం బాటిళ్లు, ఒక కారు, ఒక కంటైనర్, ఏడు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వారి పై ఎక్సైజ్ యాక్ట్ నమోదు చేసి రిమాండ్ కు తరలించారు. రంగారెడ్డి డివిజన్ డిప్యూటీ కమిషనర్ దేవిడ్, సూపర్ డెంట్ విజయ్ భాస్కర్, టాస్క్ ఫోర్స్ సహదేవ్, కుత్బుల్లాపూర్ ఎక్సైజ్ సి.ఐ యాదయ్య ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## నెంబర్ ప్లేట్ లేని వాహానాలు సీజ్

**రాచకొండ**

నంబర్ ప్లేట్ లేని వెహికల్స్ సీట్ చేస్తాం. డ్రంక్ అండ్ డ్రైవ్ మరియు హెల్మెట్ లేకుండా నెంబర్ ప్లేట్ లేకుండా వెహికల్స్ నడపకూడదని రాచకొండ జాయింట్ కమిషనర్ సత్యనారాయణ హెచ్చరించారు. మొదటిసారి తప్పు చేస్తే 3000,, రెండవసారి తప్పు చేస్తే 5000,, మూడోసారి చేస్తే ఒక సంవత్సరం పాటు జైలు శిక్ష ఉంటుందని అయన అన్నారు.

## అక్రమ బంగారం రవాణాపై కేసు నమోదు

**తిరుపతి**

తిరుపతి జిల్లా దొరవారిసత్రం పోలీస్ స్టేషన్లో డిఎస్పీ రాజగోపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. బుధవారం మధ్యాహ్నం దొరవారి సత్రం టోల్ ప్లాజా వద్ద 5.201 కేజీల బంగారు బిస్కెట్లు పట్టివేసాం. ఎటువంటి బిల్లులు డాక్యుమెంట్లు లేకుండా 2.5 కోట్ల విలువగల 5.201(ఐదు కేజీల) బంగారం బిస్కెట్లతో పాటు నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నాం. చెన్నై నుండి నెల్లూరు వైపు వెళ్తున్న రెండు టయోటా ఇతియోస్ కార్లలో వాహన తనిఖీలు భాగంగా బంగారు బిస్కెట్లు బయటపడ్డాయి. నలుగురు వ్యక్తుల నుంచి ఎటువంటి సమాచారం బిల్లులు లేకపోవడంతో అదుపులోకి తీసుకున్నామని అన్నారు. పట్టుబడ్డ వీరిపై 102 సిఆర్పీ సెక్షన్ ప్రకారం కేసు నమోదు చేసి బంగారు బిస్కెట్లను కస్టమ్స్ అధికారులకు అప్పచెబుతామని అన్నారు. ప్రభుత్వానికి గండి కొట్టేలా టాక్స్ కట్టకుండా మోసం చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. వాహన తనిఖీల్లో పాల్గొన్న నాయుడుపేట రూరల్ సీఐ సోమయ్య, సూళ్లూరుపేట సీఐ వెంకటేశ్వర్ రెడ్డి దొరవారి సత్రం పోలీస్ సిబ్బందిని డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి అభినందించారు.

## కన్నకూతురుని నరికిచంపిన తండ్రి

**పెద్దపల్లి**

పెద్దపల్లి జిల్లా మంథని మండలం భట్టుపల్లి గ్రామంలో కన్న కూతురు రజిత ని తండ్రి గుండ్ల సదయ్య గొడ్డలితో నరికి చంపాడు. గుండ్ల సదయ్య గత కొంతకాలంగా మానసిక స్థితి సరిగా లేక గ్రామంలో జనాలపై తరచుగా దాడులు చేస్తున్నాడని సమాచారం. కూతురును చంపిన తర్వాత అదే గ్రామానికి మరో వ్యక్తి దూపం శ్రీనివాస్ పై దాడి చేసాడు. సదయ్యను పట్టుకోవాడానికి వచ్చిన పోలీసులపై స్థానికులు తిరగబడ్డారు

# మంగళగిరిలో ఆర్కేకు చెక్...

**గుంటూరు :**

వచ్చే ఎన్నికల్లో నారా లోకేష్ పోటీ చేయనున్న నియోజకవర్గంపై వైసీపీ ఎక్కువ దృష్టి పెట్టింది. తాజాగా దొంతిరెడ్డి వేమారెడ్డిని మంగళగిరి వైసీపీ అధ్యక్షుడిగా నియమించారు. వేమారెడ్డి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. పార్టీ ఏర్పాటు నాటి నుండి నేటి వరకు అధినేత కు నమ్మిన వ్యక్తిగా వేమారెడ్డి నడుచుకుంటున్నారు. మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు కాకముందు ఆయన తాడేపల్లి లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షుడిగా పని చేశారు. అయితే మంగళగిరి నియోజకవర్గ శాసన సభ్యుడు ఆళ్ళ రామకృష్ణారెడ్డితో సరిపడక పోవడంతో కొన్నాళ్లుగా సైలెంట్ గా ఉంటున్నారు. ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి వ్యతిరేకంగా ఉండటంతో ఆయనకు పార్టీలో ప్రాధాన్యం తగ్గిపోయింది. అయితే ఇప్పుడు ఆళ్ల రామకృష్ణారెడ్డి పార్టీకి దూరంగా ఉంటున్నారు. దీంతో వేమారెడ్డిని వైసీపీ హైకమాండ్ ప్రోత్సహిస్తోంది. అందులో భాగంగానే వేమారెడ్డికి నగర పాలక సంస్ధ పరిధిలో పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలను అప్పగించారు. దొండి రెడ్డి వేమారెడ్డి పార్టీ కోసం అహర్నిశలు పని చేసిన వ్యక్తిగా గుర్తింపు పొందారు. ఆర్ధికంగా కూడ పార్టీ కోసం ఖర్చు పెట్టుకున్నారన్న సానుభూతి ఉంది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు తరువాత ఆయన కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి జగన్ తో నడిచారుజగన్ పాదయాత్ర ఉమ్మడి గుంటూరు జిల్లాలో జరిగిన సందర్భంలో వేమారెడ్డి ఏర్పాట్లు చేశారు. చివరకు పార్టీ అధికారంలోకి రావటంతో ఆయనకు ఎమ్మెల్సీ స్ధానం దక్కుతుందని ప్రచారం జరిగింది. అయితే ఎమ్మెల్యే ఆర్కే తనకు పోటీ అవుతారనే అభిప్రాయంతో బీసీ వర్గానికి చెందిన మాజీ మంత్రి మురుగుడు హనుమంతరావుకు ఎమ్మెల్సీ పదవి వచ్చేలా చేశారని అంటున్నారు. దొంతిరెడ్డి వేమారెడ్డిని యాక్టివ్ చేస్తూ జగన్ తీసుకున్న నిర్ణయంతో సొంత పార్టీలోనే వివిధ రకాలుగా ప్రచారాలు జరుగుతున్నాయి. మంగళగిరి ఎమ్మెల్యే ఆర్కే కు చెక్ పడినట్లేనని చెప్పుకుంటున్నారు. ఆర్కే విముక్త మంగళగిరి లక్ష్యంగా పని చేస్తున్న స్వపక్ష విపక్ష, శక్తులకు వేమారెడ్డి రాక తో ఉత్సాహం వచ్చిందంటూ కామెంట్స్ చేస్తున్నారు. శాసన సభ్యుడుగా ఉన్న ఆర్కే పై పెరిగిన వ్యతిరేకతతో అప్రమత్తమైన వైఎస్ఆర్ కాంగ్రెస్ అధిష్టానం ఈ ని ర్ణయం తీసుకుందంటూ సొంత పార్టిలోనే ప్రచారం జరుగుతుంది. మంగళగిరి నియోజకవర్గ వైకాపా రాజకీయ స్ధితిగతులపై ఎంపి ఆళ్ల ఆయోధ్య రామిరెడ్డి, పరిశీలకులు నిమ్మకాయల రాజనారాయణల పరిశీలించారని అంటున్నారు. మరో వైపున మంగళగిరి నియోజకవర్గంలో తెలుగు దేశం నియోజకవర్గ ఇంచార్జ్ గా నారా లోకేష్ రేసులో ఉన్నారు. ఆయనకు చెక్ పెట్టేందుకు కొత్త సమీకరణాలు ప్రయత్నిస్తున్నారు.

# ముద్రగడ సెకండ్ ఇన్నింగ్స్

**కాకినాడ:**

కాపు రిజర్వేషన్ల ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మళ్లీ ప్రత్యక్ష రాజకీయాల్లో యాక్టివ్ అయ్యేందుకు నిర్ణయం తీసుకున్నట్లుగా కనిపిస్తోంది. త్వరలోనే తన రాజకీయ నిర్ణయం ప్రకటిస్తానని ముద్రగడ పద్మనాభం తాజాగా ఓ లేఖ విడుదల చేశారు. కాపు సామాజికవర్గ ప్రజలకు ఉద్దేశించి రాసిన లేఖలో తుని రైల్వే కేసు కొట్టివేసినందున సత్యం జయించిందని సంతోషం వ్యక్తం చేశారు. తన జాతి రిజర్వేషన్ జోకర్ కార్డులా మారినందుకు బాధపడుతున్నానని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారు. 2016 వ సంవత్సరం ఫిబ్రవరి 2 వ తేదీన తనను తీహార్ జైలుకు తీసుకెళ్లేందుకు హెలికాప్టర్ రెడీగా పెట్టారని.. బెయిల్ తెచ్చుకోండి, లేదా అండర్ గ్రౌండ్ కి వెళ్ళమని సలహాలు ఇచ్చారన్నారు. అదే చేసి ఉంటే కులంతో పాటు ఉద్యమం కూడా చులకనయ్యే ప్రమాదం ఉండేదన్నారు. అప్పటి డిజిపికి కూడా ఉత్తరం ద్వారా స సమస్త కేసులు నామిద పెట్టుకోండి అని లేఖలో ప్రస్తావించానన్నారు. ఎన్నో



ఉద్యమాలు చేసినా ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు పాడుచేయమని ఎప్పుడూ సలహాలు ఇవ్వలేదని ముద్రగడ స్పష్టం చేశారు. కాపు సామాజిక వర్గానికి రిజర్వేషన్లు కల్పించాలని ముద్రగడ పద్మనాభం డిమాండ్ చేస్తున్నారు. ముద్రగడ పద్మనాభంను వైఎస్ఆర్‌సీపీలోకి ఆహ్వానించినట్లుగా ప్రచారం జరుగుతోంది. అయితే ముద్రగడ పద్మనాభం మాత్రం ఇప్పటివరకు ఏ నిర్ణయం తీసుకోలేదు. ళ లేఖలో మాత్రం తన రాజకీయ భవిష్యత్తును త్వరలోనే ప్రకటించనున్నట్టుగా ముద్రగడ పద్మనాభం ప్రకటించడం ఏపీ రాజకీయాల్లో ప్రాధాన్యత కల్గించింది. ఆయనతో బీజేపీ నేత జీవీఎల్ నరసింహారావు కూడా చర్చలు జరిపారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో కాపు రిజర్వేషన్ల కోసం ముద్రగడ పద్మనాభం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. 2016లో తునిలో రైలు దగ్ధమైంది. ఈ కేసును విజయవాడ రైల్వే కోర్టు కొట్టివేశారు. ఈ కారణంగానే లేఖ రాశారు. ఏపీ రాష్ట్రంలో వచ్చే ఏడాది సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయి. వచ్చే ఎన్నికల్లో ఆయన పోటీ చేయాలని అనుకుంటున్నట్లుగా చెబుతున్నారు. ఆయన కాకపోతే ఆయన వారసుడ్ని అయినా రంగంలోకి దించే అవకాశాలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో రిజర్వేషన్ల కోసం తీవ్ర ఉద్యమం చేసినా ఈ ప్రభత్వంపై ఆయన సాఫ్ట్ గా ఉన్నారు. ఎలాంటి ఉద్యమం చేయలేదు. గత టీడీపీ ప్రభుత్వం ఇచ్చిన ఐదు శాతం రిజర్వేషన్లు చెల్లుతాయని కేంద్రం చెప్పినా ముద్రగడ పెద్దగా స్పందించలేదు. రద్దు చేసిన ఐదు శాతం రిజర్వేషన్లను పునరుద్దరించాలని ఆయన ఎలాంటి ఉద్యమం చేయలేదు. దీంతో ఆయన వైఎస్ఆర్‌సీపీలో చేరుతారన్న అభిప్రాయం వినిపిస్తోంది.

# మరో వివాదంలో రాపాక...

**రాజమండ్రి:**

ప్రజాప్రతినిధులు ప్రజాధనంతో రోడ్లు వేయిస్తారు. మౌలిక సదుపాయాలు కల్పించుకుంటారు. జనసేన తరపున రాజోలు నుంచి గెలిచిన రాపాక కూడా అదే చేశారు. కానీ ఆ రోడ్డు తన ఇంట్లో వేయించుకున్నారు. జనసేన పార్టీ నుంచి ఎన్నికైన రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు వరుస వివాదాల్లో నిలుస్తున్నారు.. ఇటీవలే తాను దొంగ ఓట్లు ద్వారా ఎన్నికయ్యానని చింతలపూడి అనే గ్రామంలో ఓ వేదికపై మాట్లాడి ఏకంగా ఎన్నికల కమిషన్ ద్వారా విచారణకు ఆదేశాలంది చిక్కుల్లో పడ్డ రాపాక ఇప్పుడు నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఓ వ్యక్తి ఫిర్యాదు చేయడంతో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లా విచారణకు ఆదేశించారు. రాజోలు నియోజకవర్గ పరిధిలోనే మలికిపురం మండలం కత్తిమండ గ్రామంలో ఎమ్మెల్యే రాపాక నూతన గృహాన్ని నిర్మించుకున్నారు. అయితే ఇంటి ప్రహారీ గేట్ నుంచి ఇంటి వరకు రూ. 12 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మించారు. ఇవి ఎంపీ ల్యాడ్స్ నుంచి మంజూరైన నిధులు. కాగా దీనిపై



కేశవదాసుపాలెంకు చెందిన వెంకటపతిరాజు అనే వ్యక్తి కేంద్ర మంత్రిత్వశాఖకు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు సదరు మంత్రిత్వ శాఖ నుంచి విచారణ చేయాలని ఆదేశాలందాయి. జిల్లా పంచాయతీరాజ్ ఎస్ఈ చంటిబాబు కూడా ధృవీకరించారు. ఈ రోడ్డు నిర్మాణంపై విచారణ చేసి నివేదిక ఇవ్వాలని ఆదేశాలందాయని తెలిపారు. ఇంటి ప్రహారీ లోపల భాగంలో సీసీ రోడ్డు నిర్మించున్నారన్న అభియో గాలపై ఎమ్మెల్యే రాపాక వరప్రసాద్ వివరణ ఇచ్చారు. ఎమ్మెల్యేగా ఉన్న తన ఇంటికి కలవడానికి అనేక మంది ప్రజలు వస్తూ ఉంటారని, వారు ఇబ్బందులు పడకూడదనే ఆ స్థలాన్ని పంచాయతీకు రాసిచ్చి ఆపై తీర్మాణం చేశాకే రోడ్డు నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. అంతే కాకుండా కొంత మేర ఆ రోడ్డును అనుకుని కొన్ని ఇళ్లు ఉన్నాయని అందుకే రోడ్డు నిర్మించినట్లు చెబుతున్నారు. జనసేన పార్టీ తరపున డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం నుంచి 2019లో పోటీచేసి గెలుపొందిన రాపాక వరప్రసాదరావు ఏడాది కాలవ్యవధిలోనే అధికార వైసీపీ అనుకూలంగా ఉంటూ వ్యవహరిస్తున్నారు. నేరుగా వైసీపీ అధికారిక కార్యాక్రమాల్లో పార్టీ కండువా కప్పుకుని మరీ తిరుగుతున్నారు. అయితే ఈక్రమంలోనే ఇటీవలే మలికిపురం మండలం చింతలపూడి గ్రామంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడిన ఓ వీడియో వైరల్ అయ్యింది. తాను దొంగ ఓట్లతో నెగ్గానని ఆయనే స్వయంగా చెప్పిన మాటలు అందులో ఉన్నాయి. అయితే అది ఇప్పటి మాట కాదని, గతంలో తాను ఎమ్మెల్యేగా పోటీచేసినప్పటి మాట అని సర్ధి చెప్పుకోవాల్సి వచ్చింది. అయితే దీనిపై ఓ వ్యక్తి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదుచేయడంతో విచారణకు ఆదేశించింది. దీనిపై సంబందిత ఆదేశాలు జిల్లా కలెక్టర్ హిమాన్షుశుక్లాకు అందిన ట్లు కలెక్టరేట్ వెల్లడించింది..

# ఆఫర్ లెటర్లు క్యాన్సిల్ చేస్తున్నకంపెనీలు

**హైదరాబాద్:**

కొత్తగా ఐటీ కోర్సులు చేసిన విద్యార్థులకు ఉద్యోగాల అంశం కలవరపెడుతోంది. క్యాంపస్ నియామకాల్లో ఎంపికై ఆఫర్ లెటర్లు వచ్చినా.. ఉద్యోగాల్లో చేరడానికి ఇంకా ఎదురుచూపులు తప్పడం లేదు. చిన్న సంస్థల నుంచి ఐటీ దిగ్గజాల దాకా ఇలాగే వ్యవహరిస్తుండటం.. ఆఫర్ లెటర్లు ఇచ్చి ఏడాది దాటిపోతున్నా ఉద్యోగాల్లో చేర్చుకోకపోవడం తీవ్ర ఆందోళన రేపుతోంది. పారిశ్రామిక వర్గాల లెక్కల ప్రకారం.. గత ఏడాది ఆగస్టులో తెలంగాణలో బహుళజాతి సంస్థలు, అంకుర సంస్థలు, చిన్న ఐటీ కంపెనీలు కలిపి 24,500 మందిని క్యాంపస్ నియామకాల ద్వారా ఎంపిక చేసుకున్నాయి. కానీ ఇందులో ఇప్పటివరకు 2,300 మందికి మాత్రమే నియామక ఉత్తర్వులు వచ్చినట్టు అంచనా. రాష్ట్రంలోని టాప్ టెన్ ఇంజనీరింగ్ కాలేజీల్లో జరిగిన నియామకాల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఉద్యోగం వచ్చేసినట్టేనని ఆనందపడ్డ విద్యార్థులు.. క్రమంగా ధైర్యం కోల్పోతున్నారు. గత ఏడాది ఆగస్టులో సాఫ్ట్‌వేర్ కంపెనీలు దేశంలోని ప్రముఖ ఇంజనీరింగ్ కాలేజీల్లో క్యాంపస్ నియామకాలు చేపట్టాయని.. పలురకాల పరీక్షల తర్వాత ఆఫర్ లెటర్లు కూడా ఇచ్చాయని, ఆ తర్వాత మరే స్పందనా లేదని ఎంపికైన విద్యార్థులు వాపోతున్నారు. అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు



నన్ను బీటెక్ 4వ సంవత్సరం మొదటి సెమిస్టర్‌లోనే ఓ కంపెనీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగానికి ఎంపిక చేసింది. రెండో సెమిస్టర్ కాగానే అపాయింట్‌మెంట్ ఆర్డర్ వస్తుందని.. అప్పట్నుంచే శిక్షణ మొదలవుతుందని, వేతనం కూడా ఇస్తామని చెప్పారు. కానీ 10 నెలలు గడిచింది. ఇంతవరకు అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. క్యాంపస్ రిక్రూటీ అంకుర సంస్థలు, చిన్న కంపెనీలు మాత్రం క్యాంపస్ నియామకాల్లో ఎంపిక చేసుకున్నవారిని ఉద్యోగాల్లోకి ఆహ్వాని స్తున్నాయి. కానీ అవసరమైన మేర తక్కువ సంఖ్యలోనే సిబ్బందిని తీసుకు ఒటున్నాయి. కోవిడ్ తర్వాత ఆశించిన మేర ప్రాజెక్టులు రావడం లేదని.. అందుకే ఆఫర్ లెటర్ ఇచ్చినా ఉద్యోగాల్లోకి పిలవలేక పోతున్నామని కొన్ని కంపెనీల నిర్వాహకులు చెప్తున్నారు. మరికొన్ని కంపెనీలు కొత్తగా నియామకాలను నిలిపేయడమేగాక ఉన్న ఉద్యోగుల వేతనాలు తగ్గించుకుం టున్నాయని అంటున్నారు. గత ఏడాది కాలంలో ప్రపంచవ్యాప్తంగా 570 కంపెనీలు 1.70 లక్షల మంది ఐటీ ఉద్యోగులను తొలగించినట్టు లేఆఫ్స్ ఎఫ్‌వైఐ సంస్థ తమ నివేదికలో వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మంద గమనం కొనసాగుతోంది. దీనితో ఐటీ కంపెనీలు కొత్త నియామకాల విషయంలో వెనుకాడుతున్నాయి. అమెరికాలో అత్యధిక ద్రవోల్బణం, స్థిరాస్తి, బ్యాంకింగ్ సంక్షోభం నేపథ్యంలో.. అక్కడ ఆర్థిక వ్యవస్థ గాడిన పడటానికి కనీసం రెండేళ్లు పడుతుందని మార్కెట్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. యూరప్ దేశాలు, జపాన్ లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలోనే దిగ్గజ కంపెనీలు కూడా ఇటీవల ఉద్యోగులను తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తున్నాయి. కొత్త నియామకాలు వాయిదా వేస్తూ వస్తున్నాయి.

# కింగ్ మేకర్ గా కుమారస్వామి..?

**బెంగళూరు:**

కర్ణాటకలో జరిగిన ఎన్నికల్లో ఏబీపీ-సీఓటర్ ఎగ్జిట్ పోల్స్ లో కాంగ్రెస్ పార్టీకి స్వల్ప మొగ్గు కనిపిస్తోంది. ఆ పార్టీకి 100 నుంచి 112 సీట్లు వరకూ రావొచ్చని ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. అయితే మెజార్టీకి కావాల్సింది 113 స్థానాలు. బీజేపీకి 83-95 సీట్లు రావొచ్చని ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. జేడీఎస్‌కు 21-29, ఇతరులకు 2-6 మధ్య సీట్లు వచ్చే అవకాశం ఉంది. ప్రాంతాల వారీగా ఎగ్జిట్ పోల్స్ అంచనాలు ఎలా ఉన్నాయో కింద చూడవచ్చు. హైదరాబాద్ కర్ణాటక ప్రాంతంలో మొత్తం 31 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. ఇక్కడ కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన ఆధిక్యత చూపిస్తుందని ఓటర్ ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. కాంగ్రెస్‌కు13-17 సీట్లు లభించే అవకాశం ఉంది. బీజేపీకి 11-15 మధ్య సీట్లు లభిస్తాయి. జేడీఎస్‌కు 0-2 , ఇతరులకు 0-3 సీట్లు వస్తాయని ఎగ్జిట్ పోల్స్ వెల్లడింటాయి. ఓట్ షేర్ హైదరాబాద్ కర్ణాటకలో బీజేపీకి 38, కాంగ్రెస్ కు 44, జేడీఎస్‌కు13 శాతం ఓట్లు లభించే అవకాశం ఉంది. ముంబై కర్ణాటక ప్రాంతంలో 50 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. ఇక్కడ హోరాహోరీగా రెండు పార్టీలు సీట్లు సాధించే అవకాశం ఉంది. బీజేపీకి 24-28 మధ్య సీట్లు లభిస్తాయి. కాంగ్రెస్ కు 22-26 మధ్య సీట్లు వస్తాయి. జేడీఎస్ , ఇతరులు 0-1 మధ్య గెలుపొందే అవకాశం ఉంది. ఓవరాల్ గా ఓట్లు కాంగ్రెస్ పార్టీకి 44, బీజేపీకి 43 శాతం లభించే అవకాశాలు ఉన్నాయి. కోస్టల్ కర్ణాటక సంప్రదాయకంగా బీజేపీ బలంగా ఉంది. ఈ ఎన్నికల్లోనూ బీజేపీ బలం స్పష్టంగా కనిపి?స్తోంది. ఇక్కడపూర్తి స్థాయిలో బీజేపీ లీడ్ చూపిస్తోందని ఎగ్జిట్ పోల్స్ చెబుతున్నాయి.



మొత్తం కోస్టల్ కర్ణాటకలో ఉన్న 21 సీట్లలో 19 వరకూ బీజేపీకి దక్కే సూచనలు ఉన్నయి. కాంగ్రెస్ పార్టీ అతి కష్టం మీద రెండు నుంచి ఆరు స్థానాలు దక్కించుకునే చాన్స్ ఉంది. ఓటు షేర్ కూడా బీజేపీకి ఏకంగా 49 శాతం లభించనుందని ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. కాంగ్రెస్ కు 37 శాతమే వస్తాయని చెబుతున్నాయి. ఇక సెంట్రల్ కర్ణాటకలో మొత్తం 35 స్థానాలు ఉన్నాయి. ఇక్కడ హోరాహోరీగా పోరు సాగుతోంది. అయితే కాంగ్రెస్ పార్టీనే లీడ్ సాధించే అవకాశాలు ఉన్నాయి. సెంట్రల్ కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీకి 18-22 మధ్య స్థానాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. బీజేపీ కి 12-16 మధ్య అవకాశాలు ఉన్నాయి. 44 శాతం ఓటు షేర్ కాంగ్రెస్‌కు 39 శాతం ఓటు షేర్ బీజేపీకి లభించే అవకాశ ఉంది. కర్ణాటకలో గెలుపోటముల్ని నిర్ధారించేది ఓల్డ్ మైసూర్ ప్రాంతం. ఇక్కడ 55 అసెంబ్లీ సీట్లు ఉన్నాయి. ఈ ప్రాంతంలో మొదటి నుంచి బీజేపీ బలహీనంగా ఉంది. పోటీ కాంగ్రెస్, జేడీఎస్ మధ్యనే ఉంది. కాంగ్రెస్ 28-32 మధ్య సీట్లు సాధించే అవకాశాలు ఉండగా.. జేడీఎస్‌కు 19-23 మధ్య సీట్లు లభించే చాన్స్ ఉంది. బీజేపీకి 0-4 మధ్య సీట్లు వస్తాయని ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. ఓటు షేర్ లో కూడా కాంగ్రెస్ ముందంజలో ఉంది. కాంగ్రెస్ కు 38, జేడీఎస్ కు 29, బీజేపీకి 26 శాతం వరకూ ఓట్లు లభించవచ్చు. గ్రేటర్ బెంగళూరులో మొత్తం 32 స్థానాలు ఉన్నాయి. పూర్తిగా అర్బన్ ప్రాంతం కావడంతో బీజేపీ ఆధిక్యత చూపిస్తోందని ఎగ్జిట్ పోల్స్ వెల్లడించాయి. బీజేపీ 15-19 మధ్య సాధించే అవకాశాలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీకి 11-15 మధ్య స్థానాలు వస్తాయి. జేడీఎస్‌కు 1-4 స్థానాలు రావొచ్చని అంచనా వేశారు. బీజేపీకి 45, కాంగ్రెస్ కు 39 ఓటు బ్యాంక్ లభించే అకాశం ఉంది.

# కేరళ స్టోరీ సినిమా చూసిన వాళ్లకు ఫ్రీగా టీ, కాఫీలు

**తిరువనంతపురం:**

సినిమా దేశవ్యాప్తంగా వివాదాస్పద మవుతోంది. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాలు సపోర్ట్ చేస్తుండగా..మిగతా రాష్ట్రాలు మాత్రం వ్యతిరేకిస్తున్నాయి. తమిళనాడు, కేరళలో దీనిపై పెద్ద ఎత్తున నిరసనలు జరుగుతున్నాయి. కానీ గుజరాత్‌లో మాత్రం అంతకంతకూ మద్దతు పెరుగుతోంది. ఓ టీ షాప్ ఓనర్ అదిరిపోయే ఆఫర్ ఇచ్చాడు. కేరళ స్టోరీ సినిమా టికెట్‌లు చూపించిన వారికి ఫ్రీగా టీ, కాఫీలు ఇస్తున్నాడు. సూరత్‌లోని వేసు ఏరియాలో ఉంది ఈ టీషాప్. ఆఫర్ ఇవ్వడమే కాదు. షాప్ ముందు కేరళ స్టోరీ పోస్టర్లు కూడా అంటించారు. టికెట్ చూపించిన వాళ్లకు ఫ్రీగా టీ, కాఫీ ఇస్తామంటూ పోస్టర్లు పెట్టాడు. సినిమా చూసిన వాళ్లు టికెట్‌లు చూపించి ఫ్రీగా టీ, కాఫీలు తాగి వెళ్తున్నారు. "టీ షాప్‌కి వచ్చిన వాళ్లు కేరళ స్టోరీ మూవీ టికెట్‌లు చూపిస్తే చాలు. ఉచితంగా టీ, కాఫీలు ఇచ్చేస్తాం. మే 15వ తేదీ వరకూ ఈ ఆఫర్ ఉంటుంది"దేశవ్యాప్తంగా వివాదాస్పదమవుతున్న ఎష్ట్రవ ఐవతీజీశ్రీజీ ాబినీతీఎ సినిమాను బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా బెంగళూరులోని థియేటర్‌లో చూశారు. రివ్యూ కూడా ఇచ్చారు. విషపూరితమైన ఉగ్రవాదంలో మరో కోణాన్ని కళ్లకు కట్టినట్టు చూపించారని ప్రశంసించారు. ఇప్పటి వరకూ ఆయుధాలు, బాంబులతో కూడిన ఉగ్రవాదాన్నే చూశామని...ఈ సినిమా మరో కోణంలో టెర్రరిజాన్ని పరిచయం చేసిందని కితాబునిచ్చారు. ఉగ్రవాదాన్ని ఏ రాష్ట్రానికో, మతానికో ఆపాదించాల్సిన పని లేదని తేల్చి చెప్పారు. సొసైటీకి ఈ సినిమా ఓ హెచ్చరిక అని స్పష్టం చేశారు. "తుపాకుల మోతలు, బాంబు పేలుళ్లు, ఆత్మాహుతి దాడులు..ఇలా ఎన్నో ఉగ్రచర్యల్ని చూశాం. కానీ అంత కన్నా ప్రమాదకరమైన, విషపూరితమైన ఉగ్రవాదాన్ని ఈ సినిమాలో చూపించారు. బాంబులు, ఆయుధాలు లేని ఉగ్రవాదాన్ని కళ్లకు కట్టారు. ఉగ్రవాదులు సమాజంపై ఎంత విషం చిమ్ముతున్నారో వివరించారు. ఈ ఉగ్రవాదాన్ని ఏ ఒక్క రాష్ట్రానికో, మతానికో పరిమితం చేయలేం. యువత వాళ్ల వలలో పడి ఎలా దారి తప్పుతోందో ఈ సినిమాలో చాలా స్పష్టంగా చూపించారు. అలా దారి తప్పకూడదని హెచ్చరించడమే ఈ సినిమా ఉద్దేశం. ఇది సినిమానే కావచ్చు. కానీ ఉగ్రవాదానికి సంబంధించి ఎన్నో విషయాలు ఇందులో ప్రస్తావించారు. ఉగ్ర మూకల్లో కలిసిపోతున్న మన యువత ఎలా వలలో చిక్కుతోందో చూపించారు. ఈ సినిమా అందరూ చూడాలని రిక్వెస్ట్ చేస్తున్నాను"అయితే...ఈ సినిమాని బీజేపీ ఓన్ చేసుకుంటోందని, కావాలనే విద్వేషాలు రెచ్చగొడుతోందని విమర్శిస్తున్నాయి మిగతా పార్టీలు. ముఖ్యంగా కేరళలో దీనిపై పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతోంది. పలు చోట్ల సినిమా ప్రదర్శించకుండా అడ్డుకుంటున్నారు. ముస్లిం సంఘాలు తీవ్రంగా విమర్శిస్తున్నాయి. కేరళ సీఎం పినరయి విజయన్...ఈ సినిమా తప్పుదోవ పట్టించే విధంగా ఉందని అసహనం వ్యక్తం చేశారు. అంత మంది మతం మారినట్టు లెక్కలు లేవని తేల్చి చెప్పారు. మత సామరస్యంపై విషం చిమ్ముతున్నారని మండి పడ్డారు. తమిళనాడులోనూ ఇదే స్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది.

ప్రజా తపన
prajathapana.com

# జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె విరమించాలి

**హైదరాబాద్**

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం చర్చలకు పిలిచింది అని జరుగుతున్న ప్రచారం నిజం కాదని, నిబంధనలు, ఒప్పందాలకు విరుద్ధంగా చేస్తున్న సమ్మె ను వారు వెంటనే విరమించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి గ్రామీణ మంచినీటి సరఫరా శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఒక ప్రకటన విడుదల చేశారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం చర్చలకు పిలవలేదు. ప్రభుత్వం తరపున నేను గానీ, మరెవ్వరు గానీ జూనియర్ పంచాయతీ కార్యదర్శులను చర్చలకు పిలవలేదు. అలా ప్రభుత్వం చర్చలకు పిలిచింది అని జరుగుతున్న ప్రచారం అబద్ధం. అలాంటి ప్రచారాన్ని ఎవ్వరూ నమ్మ వద్దు. ఇప్పటికైనా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె విరమిస్తే బాగుంటుంది. సీఎం కెసిఆర్ మనసున్న మహారాజు. సీఎం కి జూనియర్ పంచాయతీ కార్యదర్శులపై మంచి అభిప్రాయం ఉంది. ఆ పేరును చెడ గొట్టుకోవద్దు. ప్రభుత్వాన్ని శాసి0చాలని సాహసించడం, నియంత్రించాలని అనుకోవడం తప్పని అన్నారు,జేపీలు లు సమ్మె విరమిస్తే, సీఎం వారికి తప్పకుండా సాయం చేస్తారన్న నమ్మకం నాకు ఉంది. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేయడం నిబంధనలు మరియు చట్ట విరుద్ధం. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందానికి కూడా విరుద్ధమని అన్నారు.

సంఘాలు కట్టబోమని, యూనియన్ లలో చెరబోమని, సమ్మెలు చేయబోమని, ఎలాంటి డిమాండ్ల కు దిగబోమని మీరు ప్రభుత్వానికి బాండ్ రాసి ఇచ్చారు. మీరు రాసిచ్చిన ఒప్పందాలను మీరే ఉల్లంఘిస్తున్న తీరు బాగా లేదు. పైగా సోషల్ మీడియాలో జరుగుతున్న వెంటనే ప్రచారాన్ని నిలిపివేయాలి. మీరు నాతో ఫోన్ ద్వారా మాట్లాడారు. మీరు మీ సమస్యలు చెప్పుకున్నారు. మీరు సమ్మె విరమించాలని నేను సూచించాను. కానీ, ప్రభుత్వం చర్చలకు పిలిచింది అని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అలాంటి ప్రచారాలను ఎవరూ నమ్మవద్దు. ఇప్పటికైనా మించిపోలేదు. ప్రభుత్వం ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వెంటనే సమ్మె ను విరమించాలి. విధుల్లో చేరాలని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు విజ్ఞప్తి చేశారు.

# గంగమ్మకు సారె సమర్పించిన కమిషనర్ హరిత కుటుంబసభ్యులు

**గంగ జాతరకు పోటెత్తిన భక్తులు**

**- ఎమ్మెల్యే భూమన**

**తిరుపతి**

రుపతి గ్రామ దేవత తాతయ్యగుంట గంగమ్మ జాతర రెండవ రోజు గురువారం గంగమ్మకు సంప్రదాయబద్దంగా సారెను తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత, అనీల్ కుమార్ దంపతులు సమర్పించారు. సారె సమర్పణ కార్యక్రమంలో కమిషనర్ స్వగృహం నుండి హరిత, అనిల్ కుమార్ దంపతులు, వారి కుటుంబసభ్యులతో బాటు తిరుపతి శాసనసభ్యులు భూమన కరుణాకర రెడ్డి దంపతులు, నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్రనారాయణ, కార్పొరేటర్లు, అధికారులు, సిబ్బంది ఆద్యాంతం పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. తిరుపతి లీలామహల్ సర్కిల్ వద్ద కమిషనర్ ఇంటి నుంచి భారీ ఊరేగింపుగా మేళా తాళాలు, మంగళ వాయిద్యాలు, విచిత్ర వేషధారణలు నడుమ సారెను గంగమ్మకు సమర్పించిన మున్సిపల్ కమీషనర్ హరిత దంపతులు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ గంగమ్మ జాతరలో ప్రతి ఒక్కరూ అత్యంత భక్తశ్రద్ధలతో పాల్గొంటు న్నారని, తిరుపతి వాసైన నగరపాలక సంస్థ కమిషనర్ హరిత భక్తిశ్రద్దలతో, నిబద్ధతతో అమ్మవారికి సారెను సమర్పించి మొక్కులు తీర్చు కోవడం అందరికి ఆదర్శ నియమన్నారు. తిరుపతి గంగమ్మ జాతర, అమ్మవారికి బ్రహ్మోత్సవాలు తరహాలో జరుగుతున్నాయని ఆయన ఆనందం వ్యక్తం చేసారు. తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత ఐఏఎస్ మాట్లాడుతూ కుటుంబ సమేతంగా సంప్రదాయంగా గంగమ్మ జాతరలో సారె సమర్పించడం తమ అదృష్టమని, ఎన్నో ఏళ్లుగా వస్తున్న ఆచార సంప్రదాయం కొనసాగిస్తున్నామన్నారు. తిరుపతి నగరంలో పుట్టినప్పటి నుండి ప్రతి సంవత్సరం గంగమ్మకు వేషాలు వేస్తూ, జాతర జరుపుకుంట్టున్నామని, ఈ సంవత్సరం తిరుపతి జాతరలో తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ గా పాల్గొనడం అమ్మవారి కృపేనన్నారు. తిరుపతి నగర ప్రజలు అందరూ సంతోషంగా గంగమ్మ జాతరలో పాల్గొంటున్నారని కమిషనర్ హరిత తెలిపారు.

# తల్లిదండ్రులను విస్మరించేవారు శిక్షార్హులే

**జగిత్యాల:**



వయోవృద్ధులైన తల్లిదండ్రుల సంరక్షణ భద్రత కల్పించాల్సిన బాధ్యత పిల్లలదేనని,వారిని విస్మరించేవారు శిక్షార్హులేనని మల్యాల తహసీల్దార్ సుజాత అన్నారు.గురువారం మల్యాల తహసీల్దార్ చాంబర్ లో తెలంగాణ అల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ఆధ్వర్యంలో ముద్రించిన సీనియర్ సిటీజేన్స్ పిలుపు ద్వీమాస పత్రికలను తహసీల్దార్ సుజాత ఆవిష్కరించారు. అనంతరం తెలంగాణ ఆల్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ఆధ్వర్యంలో సిటిజన్స్ ప్రతినిధులు కలిసి తహసీల్దార్ కు పుష్పగుచ్చాలు అందించి పట్టు శాలువాలతో సన్మానించారు. అందజేశారు. .ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ పిలుపు ప్రత్యేక ద్వీమాస పత్రికలు వయోవృద్ధుల సంరక్షణ చట్టంపై అవగాహనకు దర్పణులుగా ఉన్నాయన్నారు.సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ ఆధ్వర్యంలో సంఘ ప్రతినిధులు సీనియర్ సిటిజన్స్ కు చేస్తున్న సేవలను అభినందించారు.జిల్లా రెవెన్యూ ఉద్యోగుల మాజీ అధ్యక్షుడుగా హరి ఆశోక్ కుమార్ తాను అహర్నిశలు ఉద్యోగుల,పెన్షనర్స్ సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తున్నారని ,వయోవృద్ధుల సమస్యల పరిష్కారం కోసం జిల్లా వ్యాప్తంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్న ఆదర్శనీయుడని అన్నారు.తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ తల్లిదండ్రులైన వృద్ధులను నిరాదరిస్తే ట్రిబ్యునల్ చైర్మన్ అయిన ఆర్డీవో వారికి 3 నెలల నుంచి 6 మాసాల వరకు జైలు శిక్ష విధించే వీలు వయో వృద్ధుల సంరక్షణ చట్టం లో ఉందన్నారు.. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ వయోవృద్ధుల చట్టం లో చేసిన సవరణలు సీనియర్ సిటిజన్స్ కు భరోసా నిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,,సీనియర్లు సిటిజన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం,ఉపాధ్యక్షులు ఎం.డి.యాకుబ్, కోశాధికారి వెలముల ప్రకాష్, మల్యాల నాయబ్ తహశీల్దార్ అరుణ్ కుమార్,గీర్దావర్ రాజేందర్ రావు జిల్లా,డివిజన్ సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తించాలి

**వెల్గటూర్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ భాస్కర్**

**జగిత్యాల,**

పోలీస్ స్టేషన్ కు వచ్చే బాధితులతో మర్యాదగా ప్రవర్తిస్తూ వారి ఫిర్యాదులకు న్యాయం జరిగేలా కృషి చేయాలని జిల్లా ఎస్పీ ఎగ్గడి భాస్కర్ అన్నారు.. గురువారంజిల్లా ఎస్పీ ఆకస్మికంగా వెల్గటూర్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్ లో ఎంత మంది సిబ్బంది ఉన్నారు, వారు ఏ ఏ విధులు నిర్వహిస్తున్నారో పరిశీలించారు.పోలీస్ స్టేషన్ నుండి రోజు ఎన్ని బ్లూ కోల్ట్స్, పెట్రో కార్స్ విధులు నిర్వహిస్తున్నాయని, పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కడెక్కడ ఎన్ని బిట్స్ నడుస్తున్నాయని తెలుసుకొని ప్రాపర్ గా పెట్రోలింగ్ నిర్వహిస్తూ దొంగతనాలు జరగకుండా చూసుకోవాలని ఆదేశించారు. డయల్ 100 కాల్ రాగానే వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య పరిష్కరించాలని, బ్లూకోల్ట్స్, పెట్రోల్ కార్ నిరంతరం 24 లీ 7 గస్తీ నిర్వహించాలని ,సిబ్బంది తమకు కేటాయించిన గ్రామాల్లో పూర్తి సమాచారం సిబ్బంది అందరి దగ్గర ఉండాలని, ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో వుంటూ ప్రజల సమస్యలను తీర్చాలని, ప్రజా ఫిర్యాదులలో ఎటువంటి జాప్యం చేయకుండా తక్షణమే స్పందించాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది అందరి కృషి చేయాలని సిబ్బంది, అధికారులు అందరూ విధులు సక్రమంగా నిర్వహించడం ద్వారానే శాంతిభద్రతలు అదుపులో ఉంటాయని సూచించారు. గ్రామాల్లో ఎలాంటి సంఘటనలు జరిగినా పై అధికారులకు తక్షణమే తెలియజేయాలని సూచించారు. ప్రస్తుత రోజుల్లో మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయి కావున ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని డ్రంక్ అండ్ డ్రైవ్ చేసే వారిపై పై ఎక్కువ దృష్టి సారించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు.జిల్లా ఎస్పీ తోపాటుధర్మపురి సి.ఐ కోటేశ్వర్, ఎస్సై నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.

# నర్సింగ్ కు వన్నె తెచ్చిన అసిస్టెంట్ ప్రొఫెసర్ లిల్లీ మేరీ

**స్టాఫ్ నర్స్ గా మొదలై అసిస్టెంట్ ప్రొఫెసర్ సేవలు**

**హైదరాబాద్**



నర్సింగ్ అంటే డాక్టర్స్ ఏది చెబితే అది చేయటం కాదు, మందులు ఇవ్వడం ఒక భాగమే రోగి అవసరాలు, మనసు విప్పి మాట్లాడటం, ఒక్కోసారి కేవలం చేయి పట్టుకుని నిలబెడితే సరిపోతుంది. నర్సింగ్ అంటే మనిషికి తోడుగా ఉండటం., " బాధలో నేనున్నాను" అని చెప్పటం. ఇప్పుడు నిజమైన నర్సింగ్ ఎవరు చేయడం లేదు

ఆసుపత్రిలో రోగి అడుగుపెట్టింది మొదలు., పూర్తిగా కోలుకుని బయటకు వెళ్లే వరకు అన్ని రకాల సపరి చర్యలు చేసే వృత్తి నర్సింగ్. రోగి రోగ చరిత్ర నమోదు చేసుకోవడం, వైద్యుల సూచనల మేరకు వైద్య పరీక్షలు నిర్వహించడం... సమయానికి రోగికి మందులు అందించటం, ఇంజక్షన్లు ఇవ్వడం, ఆసుపత్రిలో రోగి వినియోగించే పరికరాలు శుభ్రంగా ఉంచటం, ఎలక్ట్రానిక్ వస్తువుల పనితీరు పర్యవేక్షించటం... ఇలా రోగిని నిరంతరము పర్యవేక్షిస్తూ కనిపెట్టుకొని ఉండే వృత్తి నర్సింగ్. వీరికి సేవా దృక్పథం, సహనం, సహజ లక్షణాలుగా కలిగి ఉంటాయి.

ప్రపంచానికి పెను సవాలుగా నిలిచిన ఇనీలతిట-19 వ్యాధి ఉధృతిని దీటుగా ఎదుర్కొని సంపూర్ణ నియంత్రణ పై పట్టు సాధించేందుకు అందరికీ వ్యాక్సినేషన్ అను నినాదంతో ప్రపంచములోనే గౌరవప్రదమైన స్థానాన్ని సంతరించుకున్న మన దేశం నిజముగా గొప్ప దేశమే. ఈ గౌరవం వెనుకాల ఎంతో మంది మహిళల దీక్ష , కృషి మరియు సేవలు సంపూర్ణముగా లభించాయి, కనుక మనకి గౌరవం దక్కింది. వృత్తిరీత్యా స్టాఫ్ నర్స్ గా గాంధీ ప్రభుత్వ ఆస్పత్రిలో సేవలు అందిస్తూ అటు సామాజిక సేవ యందు, ఇటుపై చదువుల యందు తమ దృష్టి సారించి ఎంఎస్సీ నర్సింగ్ చేసి ప్రభుత్వ నర్సింగ్ కళాశాల యందు సహాయ ఆచార్యులుగా పదోన్నతి పొంది, అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పరిమితం కాకుండా సామాజిక సేవా కార్యక్రమములలో నేటి ఆదర్శ మహిళల్లో ఒకరిగా నిలిచిన వ్యక్తి ఫ్రంట్లైన్ వారియర్స్ లిల్లీ మేరీ.

మేడ్చల్ జిల్లా కూకట్పల్లి మున్సిపాలిటీ లోని బాలాజీ నగర్ కాలనీలో నివసించే లిల్లీ మేరీ కరోనా కారణంగా విధించిన లాక్ డౌన్ సమయములో తన కుటుంబానికే పరిమితం కాకుండా నిరుపేదలకు, పారిశుద్ధ్య కార్మికులకు, దివ్యాంగులకు, రోజువారీ కూలీలకు ఒక మాతృమూర్తి గా నిలబడి 45 రోజులకు రోజుకు 100 మందికి అన్నదానము చేసిన మాతృమూర్తి

కరోనా కట్టడిలో ఇన్ఫర్మేషన్, ఎడ్యుకేషన్, కమ్యూనికేషన్ అతి ముఖ్యమైన ఆయుధం. ఇందులో భాగంగా పిల్లల దగ్గర నుండి పెద్దల వరకు, పండితుల నుండి పామరుల వరకు, ఆరోగ్య విద్యపై అవగాహన కల్పించడంలో తనదైన పాత్ర పోషిస్తూ ఎప్పటికప్పుడు ప్రభుత్వం సూచిస్తున్న సూచనలను బస్తీవాసులకు చేరవేయడం ఏ కాకుండా నిత్య మాస్క్ ధారణ, సామాజిక దూరం పాటించుట, శానిటైజర్ వాడుక తో పాటు వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించి తోటి వ్యక్తులను కరోనా బారిన పడకుండా కాపాడిన మహిళ మన లిల్లీ మేరీ.

కరోనా వ్యాధి లక్షణాల గురించి అతి సామాన్య ప్రజలకు అర్ధమయ్యే రీతిలో ప్రచార ఉద్యమంతో ప్రజలను మేల్కొలిపి వ్యాధి పై ఉన్న భయాందోళనలను పారద్రోలి ప్రభుత్వ కోవిడ్19 ఉచిత సేవలను ప్రజలందరూ అందుకునేలా వ్యక్తిగత ప్రయాసతో అవసరమయిన వారిని ఇనీలతిట సెంటర్లకు తరలించడమే కాకుండా, కోరన్ టైన్ లో ఉన్న మిగిలిన కుటుంబ సభ్యులకు కూడా మనోధైర్యం కల్పిస్తూ, కష్టకాలంలో వారికి ఇష్టదైవముగా నిలిచిన మహిళ ఫ్రంట్లైన్ వారియర్ లిల్లీ మేరీ.

అందుబాటులో ఉన్న ఆధునిక ఎలక్ట్రానిక్ పరికరాలు మరియు అంతర్జాలము ద్వారా ఇనీలతిట-19 పై ప్రచార యుద్ధమే కాకుండా, హోమ్ ఐసోలేషన్ లో ఉన్నటువంటి కోవిడ్ వ్యాధిగ్రస్తులకు మరియు వారి కుటుంబ సభ్యులకు సరైన సమయంలో సరైన సలహాలు, సూచనలు అందిస్తూ వైద్యనిపుణుల యొక్క సలహాలు కూడా వ్యాధిగ్రస్తులకు అందేలా చేసి వారి స్వస్థతకు మార్గం సుగమం చేసిన కృషి వలి. ఇనీలతిట 19 నియంత్రణలో తనతోటి ఆరోగ్య కార్యకర్తలకు, పారిశుద్ధ్య కార్మికులకు అనీలతిట వ్యాక్సినేషన్ పై అవగాహన కల్పించడంలోనూ తనదైన పాత్ర పోషించారు.

ఈ విధముగా లిల్లీ మేరీ తనదైన శైలిలో ఆర్తులకు అన్న దానము చేయుట లోనూ, కోవిడ్ నియంత్రణ నియమావళి ప్రజలందర పాటించే టట్లు చైతన్యం తీసుకురావటం లోనూ, వ్యాధి సోకిన వారికి ప్రభుత్వ ఉచిత వైద్య సదుపాయాలను అందుకునేలా చేయడం, ఊనీఎవ ఐసోలేషన్ వారిని నిపుణుల సలహాలు, సూచనలతో వారి కుటుంబాలకు ధైర్యం కల్పించడం, అర్హులైన వారందరూ వాక్సినేషన్ తీసుకునేలా తోటి వారికి అవగాహన కల్పిస్తూ ఈ సమాజానికి పట్టిన అనీలతిట చీడ, పీడలను పారద్రోలుతూ, ఆరోగ్యవంతమైన స్వస్థత కలిగిన సమాజ నిర్మాణానికై పాటుపడుతున్న నేటి ఆదర్శ మహిళ ఫ్రంట్లైన్ వారియర్ లిల్లీ మేరీ.

# కారు" స్టీరింగ్ "ఎంఐఎం" చేతిలో..!

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి**

**జగిత్యాల,**

తెలంగాణ రాష్ట్రంలో కారు స్ట్రిరింగ్ ఎంఐఎం చేతిలో ఉందని ప్రభుత్వం పై వొత్తిడి తెస్తూ ప్రజల రక్షకులైన పోలీసులకే చట్టం పనికిరాని చుట్టమైందని ఓ వర్గానికి చెందిన వందలాది మంది వచ్చి ఆందోళనకు దిగితే నిఘా సంస్థలు నిద్రపోయయా అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, మాజీ మున్సిపల్చైర్ పర్సన్ భోగ శ్రావణి -ప్రవీణ్ అన్నారు. గురువారం జగిత్యాల ప్రెస్ క్లబ్ లో డాక్టర్. భోగ శ్రావణి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులతో కలసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా భోగ శ్రావణి మాట్లాడుతూ బుధవారం రోజున ఒకపూట జగిత్యాల ప్రజాలు బయభ్రాం తులకు గురయ్యేలా ఒక వర్గం పట్టణ నదిమద్యన ఆందోళన చేపట్టిందన్నారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తోపాటు 12 మంది హైకోర్టు న్యాయమూర్తులు బీరప్ప దర్శనానికి వచ్చారన్నారు. వీరందరికి అసౌకర్యం కలిగించేలా ప్రధానంగా ప్రాణాలను నిలిపే అంబులెన్స్ ను కూడా డైవర్ట్ చేసేలా ఆ వర్గం ఆందోళన చేసిందన్నారు. వాస్తవానికి గత రెండు రోజుల క్రితం బస్సులో జరిగిన సంఘటనలో ఒక మహిళ తనను టీజింగ్ చేస్తున్నారని చంటి పిల్లతో ఉన్న ఆ మహిళ తన భర్తను కోరితే వచ్చిన వ్యక్తి పోలీసు కావడంతో ఈ సంఘటనకు మతం రంగు పులిమి ఆందోళనకు దిగరన్నారు. వందలాది మంది వచ్చి పోలీసు స్టేషన్ ముందే పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారని శ్రావణి పేర్కొన్నారు. ఇద్దరు మహిళల మధ్యన జరిగిన అంశంపై విచారణ చేయకుండా వాస్తవాలను వెలికి తీయకుండా ఎంఐఎం పార్టీ ఒత్తిడితో ఆ పోలీసు అధికారి పై చర్యలను చేపట్టిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఒక వర్గానికి కొమ్ముకాస్తోందని శ్రావణి ఆరోపించారు. ఎవరికైనా కష్టం వస్తే పోలీసు స్టేషన్ మెట్లెక్కుతారని అదే పోలీసు స్టేషన్ లోని ఓ పోలీసు కె భద్రత లేకుంటే రాష్ట్రంలో శాంతి భద్రతల ఉన్నాయా అని శ్రావణి ప్రశ్నించారు. ఇక ఈ సంఘటనకు మతం రంగు పులిమి పోలీసు అధికారి పై చర్యకు ఆందోళనకు దిగేందుకు నిజామాబాద్, బోధన్, ఆర్మూర్, కోరుట్ల వంటి ప్రాంతాల నుంచి వంద లాదిగా ఒక వర్గం ప్రజలు జగిత్యాలకు వచ్చారని వీరి రాకపై నిఘా సంస్థలు ఎందుకు ఆరా తీయలేదని శ్రావణి ప్రశ్నించారు. రాష్ట్రంలో జగిత్యాలలో నిఘా సంస్థలు కేవలం బీజేపీ కార్యక్రమాలపై నిఘా పెట్టడమే పనిగా పెట్టుకున్నా రన్నారు. శాంతియుతంగా హనుమాన్ చాలీసా పటిస్తామని అంటే పోలీసులు బీజేపీ నాయకులను చేట్టుకో పుట్టకో పోలీసు స్టేషన్లలో నిర్బందిస్తారని శ్రావణి చెప్పారు.జగిత్యాల జిల్లాలో మే 31 తేదీ వరకు పోలీసు యాక్ట్ అమల్లో ఉందని ఇటివలే జిల్లా ఎస్పీ ప్రకటించారని, సభలు, సమావేశాలు, జనం గువి ౦కూడడం నిషేధ ముందున్నారు. బుధ వారం రోజున ఓ వర్గానికి చెందిన వందలాది మంది వచ్చి ఆందోళన చేస్తే పోలీసు యాక్ట్ ఎక్కడ పోయిందని శ్రావణి ప్రశ్నించారు. అలాగే ఎంత మందిపై కేసులు పెట్టారో పోలీసులు ప్రకటిం చాలని శ్రావణి డిమాండ్ చేశారు. గోరక్షక దళాలపై కేసులు పెట్టె పోలీసులు ఎందుకు నిన్న జమ కుడిన ఆ వర్గం ప్రజలపై కేసులు పెట్టలేదని ప్రశ్నించారు.బీజేపీ పార్టీ అందరి సంక్షేమాన్ని కోరుతుందని ఎవరికి అన్యాయం జరిగినా ముందుంటామని శ్రావణి చెప్పారు. అందులోనూ మహిళలకు అన్యాయం జరిగితే మొదటే ఉంటామని అన్నారు. ఇద్దరు మహిళల మధ్యన జరిగిన సంఘటనలో విచారణ జరపకుండా చర్యలు చేపట్టడాన్ని శ్రావణి తప్పుపట్టారు. న్యాయాన్ని చేయడానికి పోలీసులు విచారణ చేసి న్యాయం అందించాలని శ్రావణి కోరారు. రానున్నది బీజేపీ ప్రభుత్వమేనని ఇప్పటిలా ఒక వర్గానికి కొమ్ముకాసేలా కాకుండా అన్ని వర్గాలకు న్యాయం చేసేలా శాంతి భద్రతలను పరిరక్షించేలా బీజేపీ పాలన ఉంటుందని శ్రావణిచెప్పారు... ఒక వర్గానికి కొమ్ము కాసే చర్యలను ఆనుకోవాలని ప్రజలు అన్ని గమనిస్తున్నారని పాలకులకు బుద్ది చెప్పడం ఖాయమని భోగ శ్రావణి అన్నారు...ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చిలకమర్తి మదన్ మోహన్, వీరబత్తిని అనీల్ బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు రెంటం జగదీష్, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మరిపెల్లి సత్యం, సారంగాపూర్ మండల ప్రెసిడెంట్ ఎండబెడ్ల వరుణ్ కుమార్, పట్టణ ప్రధాన కార్యదర్శి సిరికొండ రాజన్న,బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మెరుగు ఉమేష్, జిల్లా కోశాధికారి రంజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ నిర్మాణంలో రాజకీయం వద్దు

**అవనిగడ్డ**

కృష్ణాజిల్లానాగాయలంకలో కృష్ణానదీ తీరాన పునర్నిర్మిస్తున్న వేంకటేశ్వర స్వామి దేవస్థానం నిర్మాణ విషయాల్లో రాజకీ య జోక్యం సరైన పద్ధతి కాదని గన్నవరం భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామీజీ అన్నారు ఆయన శ్రీరామపాద క్షేత్రంలో నిర్మాణంలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని పరిశీలించారు. దేవాలయ నిర్మాణానికి సాధ్యమైనంత సహకారం అందించాలే కానీ ఆటంకాలు ఎవరూ సృష్టించికూడదని స్పష్టం చేశారు. స్థానిక తహసీల్దార్ కూడా ఇబ్బంది పెడుతున్నట్లు తన దృష్టిలోకి వచ్చింద న్నారు. ఈ సమస్య రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు ప్రకటించారు.

## టామోటాకు గిట్టుబాటు ధర కల్పించాలి

**మదనపల్లె.**

అన్నమయ్య జిల్లా, మదనపల్లి టమోటో మార్కెట్ యార్డ్ వద్ద రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని మదనపల్లి మాజీ ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ నాయకులు షాజహాన్ బాషా నిరసన చేపట్టారు. టమోటో రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని తెలుగుదేశం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు.

మదనపల్లి టమాటో మార్కెట్ ఎదురుగా రెండు లోళ్ళ టమోటాలు రోడ్డుపై కింద పోసి నిరసనకు దిగారు. మోటా రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో వైసిపి ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేసారు.

గిట్టుబాటు ధరలు కల్పిస్తామని ఉచిత హామీలు ఇచ్చిన వైసిపి నాయకులు టమోటో రైతులను పట్టించుకోకపోవడం దుర్మార్గం అని విమర్శించారు

## జెడ్పీ సెంటర్లో జిల్లా కలెక్టర్ దిష్టిబొమ్మ దగ్ధం

**ఖమ్మం**

మైనార్టీలను చిన్న చూపు చూస్తున్నారని ముస్లిం మహిళలు గురువారం కలెక్టర్ దిష్టి బొమ్మ దగ్ధం చేసారు. జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ ముస్లిం మతం పట్ల వివక్ష చూపుతున్నాడని షేహాజాది ఆరోపించారు. జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యురాలు షేహాజాది వచ్చినప్పుడు వివక్షతో కలవలేదని విమర్శించారు. జాతీయ ముస్లిం కమిషన్ నుండి నోటీసులు పంపిస్తామని హెచ్చరించారు. ముస్లిం మహిళ పట్ల వివక్ష చూపిన కలెక్టర్ ను సస్పెండ్ చేయాలనీ డిమాండ్ చేసారు. విధులు సక్రమంగా నిర్వహించని కలెక్టరుపై వెంటనే చర్యలు తీసుకోవాలి. జిల్లా కలెక్టర్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేసారు. తరువాత అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసారు.

## క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు

**హైదరాబాద్**

గుట్టుచప్పుడు కాకుండా ఓ హోటల్లో క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముగ్గురు నిందితులను మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. గచ్చిబౌలిలోని హోమ్ హుడ్ హోటల్లో రూమ్ ను అద్దెకు తీసుకుని క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నట్లు సమాచారం అందడంతో మాదాపూర్ పోలీసులు దాడి చేసి ముగ్గురు నిధులను అరెస్ట్ చేశారు. నిందితుల నుండి రెండు లక్షల 60000 నగదు స్వాధీనం చేసుకోవడంతో పాటు రెండు ల్యాప్ టాప్ లు, ఐదు సెల్ ఫోన్లు ఒక కాన్ఫరెన్స్ బాక్స్ తో పాటు పది లైన్ల మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మాదాపూర్ పోలీస్ స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాదాపూర్ డిసిపి శిల్పవల్లి నిందితుల వివరాలను వెల్లడించారు.

## భారీ వర్షానికి తెగిపడ్డ చెట్లు, విద్యుత్ తీగలు

**రంగారెడ్డి**

రాజేంద్రనగర్, శంషాబాద్ లోని పలు ప్రాంతాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం తో పాటు శంషాబాద్ సమీపంలోని మామిడిపల్లి రోడ్డులో ఈదురు గాలులకు చెట్లు, విద్యుత్ తీగలు విరిగిపోయాయి. విశ్వవిద్యాలయం లోని ప్రధాన దారిలో చెట్లు పడుతున్నప్పుడు జనసంచారం లేకపోవడంతో ముప్పు తప్పింది. శంషాబాద్–మామిడిపల్లి రోడ్డులో రోడ్డుపై విరిగిపడ్డ చెట్లను ఆర్ జి ఐ ఏ పోలీసులు తొలగించారు.

## సీఎం కేసీఆర్ కు వ్యతిరేకంగా ఫ్లెక్సీలు

**సంగారెడ్డి**

సంగారెడ్డిలో సీఎం కేసీఆర్ కి వ్యతిరేకంగా బీజేపీ నేతలు ఫ్లెక్సీ ఏర్పాటు చేసారు. నిరుద్యోగుల ఆత్మహత్యలకు ప్రథమ ముద్దాయి అంటూ ఫ్లెక్సీ ఏర్పాటు చేసి మూడు ఉరి తాళ్ళు పెట్టారు. ఎందరో తల్లిదండ్రులకి కడుపుకోత మిగిల్చి రాజభోగాలు అనుభవిస్తున్న కేసీఆర్ కి ఇదే గతి పడుతుంది అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేసారు.

## ఏబీవీపీ ధర్నా

**హైదరాబాద్**

మాసబ్ ట్యాంక్ దగ్గరున్న హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ దగ్గర ఏబీవీపీ నేతలు ధర్నాకు దిగారు. శ్రీనిధి, గురునానక్ యూనివర్సిటీ గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేసారు. అర్హత లేకుండా అడ్మిషన్స్ తీసుకుంటూ యూనివర్సిటీకి ఉండవలసిన నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. లక్షల్లో విద్యార్థుల దగ్గర ఫీజులు తీసుకుని వారి భవిష్యత్ ఆగం చేశారంటు నినాదాలు చేసారు. తరువాత పోలీసులు వారిని అరెస్ట్ చేసారు.

# కాంగ్రెస్ కు ప్రియాంక చికిత్స

**హైదరాబాద్ :**

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకింకా ఆరు నెలల గడువుండగానే టీ.కాంగ్రెస్ నేతలు ప్రచార పర్వానికి శ్రీకారం చుట్టారు. యూత్ డిక్లరేషన్ పేరిట అగ్రనేత ప్రియాంకా గాంధీ చేత యువతకు గాలమేస్తూ తాము అధికారంలోకి వస్తే అమలు చేస్తామంటూ ఓ వరాల జల్లును ప్రకటించారు. రూ.4 వేల రూపాయల నిరుద్యోగ భృతి, మొదటి ఏడాదే 2 లక్షల ఉద్యోగాల భర్తీ వంటి ఆశలు యువతలో రేకెత్తించేలా యూత్ డిక్లరేషన్ రూపొందించారు. తన సొంత లోక్‌సభ నియోజకవర్గం పరిధిలో ఏర్పాటు చేసుకున్న బహిరంగ సభలో తన బలాన్ని చాటేందుకు, తనకున్న ఫ్యాన్ ఫాలొయింగ్‌ని అధిష్టానానికి తెలియజెప్పేందుకు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి ప్రయత్నించారు. అంతా ఎదురు చూసిన ప్రియాంకా గాంధీ హైదరాబాద్ పర్యటన ముగిసింది. ఇపుడే అసలు సందేహాలు తెరమీదికి వస్తున్నాయి. కష్టాల కాంగ్రెస్‌ను ప్రియాంక గట్టెక్కిస్తారా..? తెలంగాణలో తొలిసారిగా అడుగుపెట్టిన ఇందిర వారసురాలు.. నిజంగానే ఆమె వారసురాలని అనిపించుకుంటారా?? తాజాగా ప్రియాంకా గాంధీ సభ తర్వాత ఇవే ప్రశ్నలు అన్ని చోట్ల వినిపిస్తున్నాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రాన్ని తన చేతులమీదుగా ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ అదే తెలంగాణ రాష్ట్రంలో దాదాపు పదేళ్లుగా అధికారానికి దూరంగా ఉంటుందని ఆ పార్టీ నేతలు అస్సలు ఊహించ లేదు. కానీ వారి అంచనాలను, ఊహలను తారు మారు చేసింది తెలంగాణ ప్రజానీకం. దాన్ని అనుకూలంగా మలచుకున్న కేసీఆర్.. తెలంగాణలో విపక్షమనేదే లేకుండా చేసుకునే వ్యూహాన్ని అమలు చేశారు. దాదాపు సక్సెస్సయ్యారు కూడా. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున గెలిచిన ఎమ్మెల్యేలలో మూడింట రెండొంతుల మంది టీఆర్ఎస్ (ఇపుడు బీఆర్ఎస్) పార్టీలో చేరిపోయారు. దాంతో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష హోదాను కూడా కోల్పోయింది. కేసీఆర్ మిత్ర పక్షమయిన ఎంఐఎం పార్టీనే ఇపుడు తెలంగాణలో గుర్తింపు పొంది ప్రతిపక్ష పార్టీ. ఇప్పుడు అదే తెలంగాణ గడ్డపై ఎలాగైనా ఫినిక్స్ పక్షిలా ఎగరాలన్నది కాంగ్రెస్ పార్టీ కల. అందుకు ఎన్ని ప్రయత్నాలు చెయ్యాలో అన్నీ చేస్తోంది. తాజాగా యువ సంఘర్షణ పేరిట ప్రియాంకాగాంధీని రంగంలోకి దించడం, డిక్లరేషన్ పేరిట హామీలు గుప్పించడం లాంటివి అందులో భాగమే.అయితే కాంగ్రెస్ పార్టీ ఈ పరిస్థితికి దిగజారడానికి కారణాలు ప్రత్యేకంగా వెతుక్కోవాల్సినవసరం లేదు. ఒకప్పుడు పార్టీలో ఎటు చూసినా హేమా హేమీలే కనిపించేవారు. అలాంటి తెలంగాణలో కేసీఆర్ అధికారంలోకి రాగానే? చాలా మంది నేతలు అధికార పార్టీలోకి దూకేశారు. కాంగ్రెస్ పార్టీతో అనుబంధానికి గుడ్ బై చెప్పేశారు.



ప్రస్తుతం పేర్లు ప్రస్తావించాల్సిన అవసరం లేదు కానీ, గడిచిన దశాబ్దా కాలంలో ? ఒకప్పుడు తాము కాంగ్రెస్ నేతలమన్న సంగతిని వారు కూడా మర్చిపోయేంతగా వారిలో మార్పు వచ్చింది. ఇక తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మిగిలిన నేతల్లో సఖ్యత గురించి, ఆ పార్టీలో ఎప్పుడూ ఉండే ప్రజాస్వామ్యం గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆ ప్రజాస్వామ్యాన్ని అడ్డం పెట్టుకొనే? గాంధీ భవన్ సాక్షిగా పార్టీలో ఎవరి దారి వారిదే అన్నట్టుంది పరిస్థితి. నిజానికిది పార్టీలో కొత్తగా వచ్చిన మార్పేమీ కాదు.. 80వ దశకం నుంచి ఈ ధోరణి కాంగ్రెస్ పార్టీలో వుండింది. అయితే పీసీసీ చీఫ్‌గా రేవంత్ రెడ్డిని తీసుకొచ్చి పెట్టిన తర్వాత ఢిల్లీ కాంగ్రెస్ నేతలపై తెలంగాణలో మెజార్టీ కాంగ్రెస్ సీనియర్ నేతలు అంతెత్తున మండిపడ్డారు. వాటి ప్రభావం హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో ఓ మాదిరిగా కనబడ్డా? మునుగోడు బై ఎలక్షన్స్ నాటికి ఓ క్లారిటీ వచ్చేసింది. సోదరుడు కోమటి రెడ్డి రాజగోపాల్ రెడ్డి బీజేపీలో చేరిన తర్వాత అన్న కోమటి రెడ్డి వెంకటరెడ్డి? పార్టీలో సృష్టించిన అలజడి.. ఆస్ట్రేలియా టూర్‌కెళ్లి.. అక్కడ పార్టీపై మాట్లాడిన మాటలు? టి.కాంగ్రెస్ నేతలు ఎంత కలిసికట్టుగా ఉన్నారో తెలంగాణ జనాలకు క్లారిటీ వచ్చేసింది. ఆ తర్వాత కూడా సీనియర్లు సృష్టించిన అలజడికి తెలంగాణ కాంగ్రెస్ ఒకప్పటి ఇంచార్జ్ మాణికం ఠాగూర్ ఈ తెలంగాణ కాంగ్రెస్‌కో దండం అంటూ వెళ్లిపోయిన సంగతి కూడా తెలుసు. ఆ తర్వాత కొత్త ఇంచార్జ్ అ రావడం? బుజ్జగింపులు, బతిమాలడాలు? కాంగ్రెస్ నేతలకు కొత్త కాదు? దశాబ్దాలుగా చూస్తున్న తెలంగాణ జనాలకు కొత్తగా ఏం అనిపించలేదు. కొత్త ఇంచార్జ్ రావడం వల్ల ఎంత వరకు ఫలితం ఉందా అంటే అది కూడ క్వశ్చన్ మార్కే. ఇన్ని కుమ్ములాటలు? కొట్లాటలు, గ్రూపులు ఉన్న కాంగ్రెస్ పార్టీకి అంతో ఇంతో ప్లస్ ఏదైనా ఉందంటే కార్యకర్తల బలం. ఇంకా మిగిలే వున్న ఓటు బ్యాంకు కూడా పార్టీ నేతల్లో దింపుడు కల్లం ఆశలు రేపుతోంది. దాన్ని నమ్ముకునే నాయకులు అన్ని రకాల యాత్రలు చేస్తున్నారు.ఇలాంటి పరిస్థితుల్లో ప్రియాంక అనే అస్త్రాన్ని తెలంగాణలో ప్రయోగిస్తోంది కాంగ్రెస్. చూడ్డానికి అచ్చం నాటి ఇందిరమ్మను తలపించే ప్రియాంక? ఎలాంటి మ్యాజిక్ చేస్తారన్నదే ఇప్పుడు ప్రశ్న. యూపీ ఎన్నికల్లో ఫస్ట్ టైం నేరుగా పార్టీని గెలిపించే బాధ్యతలు స్వీకరించారు ప్రియాంక. యోగీ దెబ్బకు యూపీలో పెద్దగా మ్యాజిక్ ఏం జరగకపోయినా? ఆమె గురించి యూపీ ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు మాత్రం అంతో ఇంతో తెలిసింది. అప్పటి నుంచి యాక్టివ్ పాలిటిక్స్‌లో చురుగ్గానే ఉంటూ వస్తున్నారు. తాజాగా కర్నాటక ఎన్నికల ప్రచారంలో కూడా తన సోదరుడు రాహుల్‌తో పాటు బరువు బాధ్యతల్ని తన భుజాలపైనే మోశారు. అలా అక్కడ ఎన్నికల ప్రచారం ముగిసిందో లేదో.. నెక్స్ట్ టార్గెట్ తెలంగాణ రాష్ట్రమే కాబట్టి? ఇక్కడ మీటింగ్ ప్లాన్ చేశారు. నిరుద్యోగ సంఘర్షణ సభ పేరుతో గడిచిన పదేళ్లుగా తెలంగాణలో నిరుద్యోగ సమస్యపై సరూర్ నగర్ సభ సాక్షిగా సమర శంఖం పూరించారు. సరిగ్గా 43 ఏళ్ల క్రితం? ఇందిరాగాంధీ సృష్టించిన మ్యాజిక్ ప్రియాంకా గాంధీ సృష్టించగలరా..? తాజా సభతో చర్చ ఆ దిశగానే జరుగుతోంది. నిజానికి 1980లో జరిగిన మ్యాజిక్ గురించి ఈ తరంలో చాలా మందికి తెలియకపోవచ్చు కానీ? పాత తరం నేతలకు, ఇంట్లో 50 ఏళ్లు దాటిన వారికి బాగానే గుర్తుంటుంది. 1980లో జరిగిన మధ్యంతర ఎన్నికల్లో ఇందిరాగాంధీ తెలంగాణలోని మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేశారు. నిజానికి అప్పటికి ఆమె 1977లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ కంచుకోటగా భావించే రాయ్ బరేలీ నుంచి జనతా కూటమి అభ్యర్థి రాజ్ నారాయణ్ చేతుల్లో ఓడిపోయారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో ఆమెను కాంగ్రెస్ బలంగా ఉండే దక్షిణాదిలో పోటీ చెయ్యాలని అప్పటి సీనియర్ నేతలు సూచించారు. వారి సూచన మేరకు మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి బరిలోకి దిగారు. సుమారు 2 లక్షల మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఆమె ఒక్కరే కాదు? ఆమెతో పాటు అప్పుడు తెలంగాణలో ఉన్న 15 లోక్ సభ స్థానాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొత్తం 42 లోక్ సభ స్థానాలుంటే అందులో 41 స్థానాల్లో కాంగ్రెస్ విజయభేరి మోగించింది. మిగిలిన ఒక్క స్థానమైన పార్వతీపురం పార్లమెంటరీ నియోజకవర్గంలో కిశోర్ చంద్రదేవ్ కాంగ్రెస్ యూ తరపున గెలిచారుసో.. అప్పుడు ఇందిర కష్టాల్లో ఉంటే? ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ కష్టాల్లో ఉంది. అదే తేడా. మరి అప్పుడు ఇందిరమ్మ ఆదుకున్న తెలంగాణను.. ఇప్పుడు అచ్చం ఇందిరమ్మ రూపంలోనే ఉంటుందని భావించే ప్రియాంక గాంధీ మెస్మరైజ్ చేస్తారా అన్నదిపుడు పెద్ద ప్రశ్న. మే 8న జరిగిన సరూర్ నగర్ సభలో ఆమె ప్రసంగించిన తీరు చూస్తే ఇందిరమ్మ దింపేసినట్లే అనిపించింది. తనను ఇందిరమ్మ అని సంబోధించడం తనపై బాధ్యతను పెంచేసిందంటూ తెలంగాణ బాధ్యతలను ఆమె భుజానికెత్తుకున్నట్లే కనపించారు. ఇందిర రూపం మళ్లీ వర్కౌట్ అవుతుందా..? మే 8 నాటి సభ ప్రధాన ఉద్ధేశం అదే. కాంగ్రెస్ నేతలంతా ఆమె మ్యాజిక్ పని చేస్తుందనే భావిస్తున్నారు. మరోవైపు పార్టీలో ఏ చిన్న తేడా వచ్చినా హైకమాండ్ దగ్గరే తేల్చుకుంటాం అనే నేతలకు.. ఇప్పుడు నేరుగా ప్రియాంక రూపంలో ఆ హైకమాండే వాళ్ల దగ్గర కొచ్చింది. తమ మధ్య జరుగుతున్న ఆధిపత్య పోరు గురించి హైకమాండ్‌కేం చెబుతారో చూడాలి. అయితే ఇప్పుడు ప్రియాంక వచ్చినప్పుడు కూడా ఫైర్ బ్రాండ్‌గా పేరున్న కోమటి రెడ్డి వెంకటరెడ్డి విదేశీ పర్యటనలో ఉండటం విశేషం.ఇక్కడ ఇంకో సంగతి ప్రస్తావించాలి. ఆంధ్రప్రదేశ్ విడిపోక ముందు.. వైఎస్ సీఎంగా ఉండగా అంటే 2009లో జరిగిన ఎన్నికల్లోనే తెలంగాణలో ప్రియాంక గాంధీ ప్రస్తావన వచ్చిందని కూడా చెబుతారు. మెదక్ నుంచి ఇందిర పోటీ చేసినట్టు? 2009 ఎన్నికల్లో ప్రియాంకను కూడా మెదక్ నుంచి పోటీ చెయ్యాలని అభ్యర్థించాలని నాటి కాంగ్రెస్ నేతలు భావించారట. కారణాలు ఏవైతేనేం అది జరగలేదు. ప్రస్తుతం ప్రియాంక వచ్చిన పని అది కాకపోవచ్చు. కాంగ్రెస్ నిరుద్యోగ సంఘర్షణ సభ మాత్రమే కావచ్చు. కేవలం అటు బీఆర్ఎస్‌ను.. ఇటు బీజేపీని టార్గెట్ చెయ్యడానికే కావచ్చు. ఆ పని తెలంగాణ కాంగ్రెస్ లీడర్లు ఎప్పటి నుంచో చేస్తున్నారు. సో? ప్రియాంక నుంచి ఆశిస్తున్నది కేవలం విమర్శలు మాత్రమే కాదు? తమను టార్గెట్ చేస్తున్న పార్టీలపై ఎదురుదాడి చెయ్యడం మాత్రమే కాదు? నిస్తేజంలో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తల్లో సరికొత్త జోష్ నింపేలా ఆమె యాక్షన్ ప్లాన్ ఉండాలన్నది వారి ఆశ. అందుకు మే 8న జరిగిన సభలో వేదికపై ఓ వైపు ఇందిర ఉంటే మరో వైపు ప్రియాంక గాంధీ ఫోటోలు పెట్టడమే సాక్ష్యం. నాటి ఇందిరమ్మే మళ్లీ వచ్చిందని ?. తమను గట్టెక్కిస్తుందని? పీసీసీ చీఫ్ రేవంత్ సహా అందరూ ముమ్మాటికీ నమ్ముతున్నారు. ఆ విషయం ప్రియాంకకు కూడా బాగా అర్థమయ్యింది. అందుకే 43 ఏళ్లయిన తర్వాత కూడా తెలంగాణ ప్రజలు ఇంకా ఇందిరమ్మను గుర్తుంచుకున్నారంటూ ఆమె ప్రస్తావనను తీసుకొచ్చారు. మాటలు బాగానే ఉన్నాయి. తనను నయా ఇందిరమ్మగా భావిస్తున్న వారికి అన్యాయం చెయ్యనన్న ప్రియాంక? తెలంగాణ విషయంలో ఇకపై ఎలాంటి స్టెప్స్ వేస్తారన్నదే యావత్ టి.కాంగ్రెస్ నేతల మదిలో మెదులుతున్న ప్రశ్న. మరి యూపీలో సక్సెస్ కానీ ఈతరం ఇందిరమ్మ?తెలంగాణలో పార్టీకి పూర్వ వైభవం తెప్పిస్తారా..? అధికారంలో ఉన్న బీఆర్ఎస్‌ను కాదని? బీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం తామేనని పదే పదే చెబుతున్న బీజేపీని కాదని.. మ్యాజిక్ చేస్తారా.. తెలంగాణ కాంగ్రెస్‌కు కొత్త ఊపిని, సరికొత్త రూపాన్ని ఇచ్చి పార్టీని అందలమెక్కిస్తారా..? ఈ మిలియన్ డాలర్ల ప్రశ్నకు కాలమే సమాధానం చెబుతుంది.

## సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సురేష్

**విశాఖపట్నం**

ఉత్తరాంధ్రలో మౌలిక వసతుల కల్పనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి దృష్టి సారిస్తు న్నారని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ స్పష్టం చేశారు.సీహారియర్ మ్యూజియంను సందర్శించి..వీఎంఆర్డీఏ అధికారులకు పలు సూచన లు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మీడియా తో మాట్లాడారు. భోగాపురం అంతర్జా తీయ విమానా శ్రయానికి ఇటీవలే ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశార ని.. ఎయిర్పోర్టుకు కనెక్టివిటీలో భాగంగా విశాఖ నుంచి ఆరులైన్ల రహదారి నిర్మాణానికి సన్నద్ధమవుతున్నట్లు చెప్పారు.6,500 కోట్లతో నిర్మించనున్న ప్రాజెక్టుకు సంబం ధించిన డీపీఆర్ రూపకల్పనకు ప్రాథమికంగా అనుమ తులు లభించాయని చెప్పారు.త్వర లో నే తదుపరి కార్యచరణ ప్రణాళిక అమలు చేస్తామన్నారు. మంత్రి గుడి వాడ అమర్నాథ్ మాట్లాడుతూ సెప్టెంబర్ నుంచి సీఎం విశాఖలోనే ఉంటారని పునరుద్ఘాటించారు. రాబో యే కొద్ది నెలల్లో విశాఖలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమా లకు శ్రీకారం చుట్టనున్నామని చెప్పారు.అనంతరం మంత్రి సురేష్ ఎంవీపీకాలనీలో నిర్మిం చిన స్పోర్ట్స్ ఏరీనాను సందర్శించారు. ఇక్కడ చేసిన ఏర్పాట్లతో పాటు ప్రాజెక్ట్ వివరాలను జీవీఎంసీ కమిషనర్, అధి కారులను అడిగి తెలుసుకున్నా రు. ఎంవీపీకాలనీలో రూ.26 కోట్లతో నిర్మించిన అధునాతన స్పోర్ట్స్ కాంప్లె క్స్ సీఎం ప్రారంభించిన అనంతరం అందుబాటులోకి వస్తుందన్నారు.సీఎం ప్రారంభించనున్న ప్రాజెక్టుల శిలా ఫల కాలపై చంద్రబాబు, కొందరు టీడీపీ నాయకుల పేర్లు వేయాలని స్థానిక టీడీపీ ఎమ్మెల్యే వెలగపూడి చేసిన అభ్యర్థన అర్థరహితమని మంత్రి సురేష్ అన్నా రు. ఈ ప్రాజెక్టులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి, త్వరితగతిన పనులు పూర్తి చేసి, అందుబా టులోకి తీసుకొస్తున్నట్లు వివరిం చారు.

## జగన్ కు పరిపాలన చేతకావడం లేదు

**నర్సీపట్నం**

ఏపీ సిఎం జగన్ కు పరిపాలన చేతకావడం లేదని మాజీ మంత్రి పోలిట్ బ్యూరో సభ్యులు అయ్యన్నపాత్రుడు అన్నారు.జగన్ వ్యాపారమే అక్రమ మార్గంలో కొనసాగుతుందని విమర్శించారు.మద్యం రేట్లు పెంచేసి చీఫ్ లిక్కర్ తయారీ చేసి ప్రజలపై ప్రయోగిస్తున్నారని అన్నారు.పరిపాలన చేతకాని వ్యక్తిగా జగన్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతాడని,అన్నపూర్ణగా పేరుగాంచిన ఏపీ ఇపుడు గంజాయిని అందించడంలో ఏపీకి మంచి పేరు వచ్చిందని ఎద్దేవ చేశారు.నిరుద్యోగులకు ఉద్యోగాలు లేకపోవడంతో రాష్ట్రంలో యువత నిర్వీర్యం అయిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

## పేదలపై అదనపు కరెంట్ చార్జీలు మోపడం దారుణం

**బద్వేలు**

కరెంట్ చార్జీలతో రాష్టంలో వైసీపీ ప్రభుత్వం వచ్చినప్పటినుండి దాదాపు నాలుగు సంవత్సరాలుగా ట్రూఆప్ చార్జీలనీ,మరియు ఎఫ్ పీ పీ లనీ కొత్త కొత్త పేర్లతో ప్రజల కష్టాన్ని దోచుకొని వారి నడ్డి విరుస్తున్నరని బద్వేలు మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గుర్రంపాటి వెంగళరెడ్డి విమర్శించారు రోజుకో పేరుతో ఇలా విద్యుత్ ఛార్జీలు పెన్చుకుంటూ రాష్ట్రములో కొత్త పరిశ్రమలు పెట్టే వారు అసలు ముందుకు వస్తారా అని ప్రశ్నించారు. రాజన్న రాజ్యం అంటే రోజుకో చార్జీలతో ప్రజలను దోచుకోవడమేనా అని విమర్శించారు. రైతులకి ఉచిత కరెంటు ఇచ్చి వారికి బారాన్ని తగ్గించిన ప్రభుత్వం తెలుగు తెలుగుదేశం పార్టీనే అన్నారు.మీకు, మీ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి కాబెట్టే ఇలా ప్రజలను దోచుకుంటున్నారన్నారు. మీ ప్రభుత్వానికి ప్రజల పట్ల చిత్త శుద్ధి వుంటే పెంచిన కర్రెంట్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ ఆయన చేశారుప్రజలు ఎన్ని ఇబ్బందులు పడుతున్నారు వైకాపా ప్రభుత్వం గుర్తించక పోవడం శోచనీయం. వైకాపా ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయి కాబట్టే ప్రజలను అనేక విధాలుగా దోపిడీ చేస్తుందని వెంగల్ రెడ్డి ఆరోపించారు.

## విధ్వంసక పాలనకు సజీవసాక్షి జైన్ ఇరిగేషన్-నారా లోకేష్

**నందికొట్కూరు**

విధ్వంసక పాలకుడు జగన్ వినాశక చర్యలకు ప్రత్యక్షసాక్షి నందికొట్కూరు నియోజకవర్గం తంగెడంచలో నిలచిపోయిన జైన్ ఇరిగేషన్ ప్రాజెక్టని టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకష్ అన్నారు. రైతులకు అధునాతన వ్యవసాయ పరికరాలు అందించడంతోపాటు కరువు సీమలో యువతకు ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో చంద్రబాబు ఆహ్వానం మేరకు అప్పట్లో స్వర్గీయ భవర్ లాల్ జైన్ తంగెడంచలో ప్రాజెక్టు ఏర్పాటుకు ముందుకు వచ్చారు. గత ప్రభుత్వంలో ఇందుకోసం 623ఎకరాల భూమి



కూడా కేటాయించారు.

అనుకున్న ప్రకారం ఈ ప్రాజెక్టు పూర్తయితే రాష్ట్ర రైతాంగం జీవన స్థితిగతులు మారిపోయేవి. జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ సహకారం లేకపోవడంతో జైన్ ప్రాజెక్టు నిలచిపోయింది. సైకో సిఎం వికృత పాలనకు ఇదొక ఉదాహరణ మాత్రమేనని అన్నారు.

# మళ్లీ పెళ్లి థియేట్రికల్ ట్రైలర్ ఆవిష్కరణ



నవరస రాయ డా. నరేష్ వికె , పవిత్ర లోకేష్ తో కలిసి మెగా మేకర్ ఎమ్ఎస్ రాజు దర్శకత్వంలో చేసిన గోల్డెన్ జూబ్లీ ప్రాజెక్ట్ మళ్లీ పెళ్లి మే 26న థియేట్రికల్ రిలీజ్ కు సిద్ధమవుతోంది. విలక్షణమైన కథాంశంతో తొలిసారిగా ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ గా రూపొందిన ఈ చిత్రాన్ని విజయ కృష్ణ మూవీస్ బ్యానర్ పై నరేష్ స్వయంగా నిర్మించారు. సినిమా, టీజర్ తో పాటు పాటలకు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈరోజు ఈ సినిమా థియేట్రికల్ ట్రైలర్ ను విడుదల చేశారు.

ట్రైలర్ ఎలా ఉదంటే ..

మూడు ప్రధాన పాత్రలను పరిచయం చేసేలా టీజర్ ఉండగా, ట్రైలర్ కథాంశాన్ని వెల్లడిస్తుంది. నరేష్ తన సహనటి పవిత్రా లోకేష్ లో నిజమైన ప్రేమను తెలుసుకున్న సూపర్ స్టార్, తోటి వ్యక్తి కి కూడా చక్కటి భావాలు ఉన్నాయని గ్రహిస్తాడు.. ఇద్దరికీ అప్పటికే పెళ్లి అయింది మరియు పవిత్ర లోకేష్ నరేష్ పట్ల తన భావాలను దాచడానికి ప్రయత్నిస్తుంది. నరేష్ మాజీ భార్య వనిత విజయ్‌కుమార్ మీడియాను ఆశ్రయించడంతో విషయాలు గందరగోళంగా మారాయి.

కథాంశం చాలా ఆసక్తిని కలిగిస్తుంది మరియు కథనం మరింత ఆకర్షణీయంగా ఉంది. నరేష్, పవిత్ర లోకేష్ పాత్రలను ఎంఎస్ రాజు ఆసక్తికరంగా డిజైన్ చేశారు. సూపర్‌స్టార్ పాత్రలో నరేష్ బాగా కనిపించాడు, పవిత్ర లోకేష్ తన పాత్రను సమర్ధవంతంగా పోషించారు.. మరికొందరు తమ తమ పాత్రల్లో కన్విన్సింగ్ గా కనిపించారు.

ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో ఎం.ఎస్.రాజు మాట్లాడుతూ, జీవితంలో అనుకోని విధంగా కొన్ని సంఘటనలు జరుగుతుంటాయి. నాకూ జరిగాయి. ముందు నుంచి నేను దర్శకుడిని అవ్వాలనుకున్నా. 13 ఏళ్ళ వయస్సులో మీనా సినిమాను మా కుటుంబంతో చూశాను. ఇప్పుడు ఆ సంస్థకు నేను దర్శకత్వం వహిస్తానని ఊహించలేదు. ఈ సందర్భంగా నరేష్ కూ, పవిత్రగారికి ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను. నా దర్శకత్వం టీమ్ కు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేసుకుంటున్నాను అన్నారు.

నవరసరాయ నరేష్ మాట్లాడుతూ, నాకు ఊహ తెలిసినప్పటినుంచీ విజయనిర్మలగారు, కృష్ణగారు దేవుళ్ళు. వారి మేకప్ చైర్ లోనే కూర్చుని పండంటి కాపురం కు మేకప్ వేసుకున్నాను. నటుడిని కావాలనేదే నా కోరిక. అలా నేను బాలనటుడిగా నటించిన పండంటి కాపురం 1972లో రిలీజ్ అయింది. ఎస్.వి.రంగారావు వంటి హేమాహేమీల మధ్య నటించా. 1973లో నాతో అమ్మగారు ఆలోచనలను పంచుకున్నారు. అందుకే ఆ బేనర్ విలువ తెలుసు. ఇక మూడేళ్ల నాటి నుంచి ఎం.ఎస్.రాజుగారి తో ట్రావెల్ అవుతున్నాను. రెబల్ కథతో సినిమా చేయాలనుకున్నా. ఈ సినిమా కథ గురించి ఆలోచిస్తుండగా విజయకృష్ణ మూవీస్ మరలా ప్రారంభించడానికి అద్భుతమైన కాన్సెప్ట్ కుదిరింది అనిపించింది. అందుకే చేశాం. ఇప్పుడు ట్రైలర్, టీజర్ చూశారు. ఇది మచ్చు తునక మాత్రమే సినిమాలో చాలా విషయం ఉంది. ఈ కథకు టైటిల్ ఏమి పెట్టాలని అనుకున్నప్పుడు గతంలో కృష్ణగారు, విజయనిర్మలగారు నటించిన మళ్ళీ పెళ్లి గుర్తుకువచ్చి, అదే టైటిల్ పెట్టాలనిపించింది. ఈ కథకు కూడా యాప్ట్ అయిన టైటిల్. చాలా సంతోషంగా వుంది. గౌరవప్రదమైన సినిమా తీశాం. గొప్ప అనుభూతిని మీకు అందిస్తాం. ఎంటర్ టైన్ మెంట్ కూడా చాలా బాగుంటుంది అని అన్నారు.

నటి పవిత్ర లోకేష్ మాట్లాడుతూ, విజయకృష్ణ ఫిలింస్ బేనర్ లో సినిమాలు ప్రేక్షకులు ఎంజాయ్ చేసేవిధంగా వుంటాయి. ఈ బేనర్ కు కృష్ణ, విజయనిర్మలగారి ఆశీస్సులుంటాయి. మళ్ళీ పెళ్లి సినిమా గురించి చెప్పాలంటే, ఎం.ఎస్.రాజుగారి గురించి చెప్పాలి. ఆయన సినిమాలు ఆయన ఏమిటో చెబుతాయి. ప్రతి సీన్ లో ఆయన ఆలోచనలు అద్భుతంగా ఆవిష్కరించారు. ఆయన దర్శకత్వంలో నటించాలంటే నటుడుకి ప్రతిరోజు ఛాలెంజ్‌లా వుంటుంది. దర్శకుడిగా ఆయన ఏం కోరుకున్నారో అది రాబట్టడానికి ప్రయత్నిస్తారు. చాలా కూల్‌గా కావాల్సింది రాబట్టుకున్నారు. వ్యక్తులకు ఆయన ఇచ్చే గౌరవం వంటివి ఆయనుంచి చాలా నేర్చుకున్నా. ఇందులో పనిచేసిన ప్రతి టెక్నీషియన్స్ ది బెస్ట్ ఇచ్చారనే చెప్పాలి. బాల్‌రెడ్డి కెమెరా నైపుణ్యం చాలా బాగుంది. ఇలా అందరూ తమ పని తాము బాగా చేశారు. నా పాత్ర గురించి రాజుగారు డెలివర్ చేసేటప్పుడు పాత్రకు పూర్తి న్యాయం చేశానని అనుకుంటున్నాను. సహ నటుడు నరేష్ గారు ఫైన్ యాక్టర్ ఇన్ ఇండియా అని చెప్పగలను. ఈ సినిమా చూశాక ప్రతివారు ఫీడ్ బ్యాక్ తీసుకుంటామని తెలిపారు.

అనంతరం విలేకరులు అడిగిన పలు ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ఈ సినిమా కథ గురించి వేసిన ప్రశ్నకు నరేష్ సమాధానం ఇస్తూ, రఘుపతివెంకయ్యనాయుడు బయోపిక్ లో నేను నటించాను. కానీ మళ్ళీపెళ్లి సినిమా అనేది నా బయోపిక్ కాదు. ప్రతివారికి ఏదో ఒకచోట కనెక్ట్ అయ్యేలా రాజుగారు కథను తీసుకువచ్చారు. ఇది నా కథ కాదు అని చెప్పారు.

చిత్ర కథ గురించి దర్శకుడు ఎం.ఎస్.రాజు మాట్లాడుతూ, ఈ సినిమా థీమ్ ఏమిటంటే, ఫస్టాఫ్ కంటే సెకండాఫ్ బాగుండాలి. అది సినిమాకే కాదు జీవితం కూడా అలాగే వుండాలని అనుకుంటాం. ఇది ప్రపంచ సమస్య. దీనిపైనే ఓ సినిమా తీయాలనుకుని చేసిందే మళ్ళీ పెళ్లి అని అన్నారు.

ఎంఎస్ బాల్ రెడ్డి సినిమాటోగ్రఫీ అందించగా, విజువల్స్ కలర్ ఫుల్ గా అనిపించాయి. అరుల్‌దేవ్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఎమోషన్స్‌ని పెంచింది.


సురేష్ బొబ్బిలి మరియు అరుల్‌దేవ్ కలిసి ఈ చిత్రానికి పాటలు అందించగా, జునైద్ సిద్దిక్ ఎడిటర్. భాస్కర్ ముదావత్ ప్రొడక్షన్ డిజైనర్. అన్ని పాటలకు అనంత శ్రీరామ్ సాహిత్యం అందించారు.

జయసుధ, శరత్ బాబు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంలో వనిత విజయకుమార్, అనన్య నాగళ్ల, రోషన్, రవివర్మ, అన్నపూర్ణ, భద్రం, యుక్త, ప్రవీణ్ యండమూరి, మధు తదితరులు నటిస్తున్నారు.

సినిమా ఎమోషన్స్‌తో పాటు వినోదం మరియు ఇతర అంశాలతో కూడి ఉంటుందని ట్రైలర్‌ని బట్టి తెలుస్తోంది. ఈ వీడియో కుటుంబ సభ్యులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

తారాగణం: డాక్టర్ నరేష్ , పవిత్ర లోకేష్, జయసుధ, శరత్ బాబు, వనిత విజయకుమార్, అనన్య నాగళ్ల, రోషన్, రవివర్మ, అన్నపూర్ణ, భద్రం, యుక్త, ప్రవీణ్ యండమూరి, మరియు మధు

# రంగబలి జూలై 7న విడుదల



యంగ్ అండ్ ప్రామిసింగ్ హీరో నాగ శౌర్య రంగబలి అనే ఆసక్తికరమైన ప్రాజెక్ట్ కోసం డెబ్యూ దర్శకుడు పవన్ బాసంశెట్టి తో కలిసి పనిచేస్తున్నారు. ఉగాది నాడు విడుదల చేసిన టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియో, పల్లెటూరి నేపథ్యం లో సాగే కథతో రంగబలి ఫన్ రైడ్ గా ఉండబోతోందనే సూచనను అందిస్తోంది. విభిన్నమైన కాన్సెప్ట్ లతో విభిన్నమైన చిత్రాలను తెరకెక్కించడంలో మంచి అభిరుచి ఉన్న ఎస్ ఎల్ వి సినిమాస్ కు చెందిన సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని అత్యంత వైభవంగా నిర్మిస్తున్నారు.లేటెస్ట్ అప్‌డేట్ ఏంటంటే.. రంగబలి జూలై 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదలవుతోంది. నాగ శౌర్య ట్రెండీ గెటప్ లో కనిపిస్తున్న పోస్టర్ ద్వారా మేకర్స్ ఈ వార్తను అధికారికంగా ప్రకటించారు.

ఈ సినిమాలో నాగ శౌర్య విభిన్నమైన పాత్ర లో నటిస్తున్నాడు అందుకు అతను మేకోవర్ చేసాడు. ఈ చిత్రంలో ప్రముఖ సాంకేతిక నిపుణులు వివిధ క్రాఫ్ట్ లలో పని చేస్తున్నారు.

దివాకర్ మణి సినిమాటోగ్రఫీ, పవన్ సి హెచ్ సంగీత దర్శకుడు. ఎడిటర్ కార్తీక శ్రీనివాస్, ఆర్ట్ డైరెక్టర్ ఎఎస్ ప్రకాష్.ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. హీరోయిన్, ఇతర వివరాలను త్వరలోనే తెలియజేస్తారు మేకర్స్.

తారాగణం: నాగ శౌర్య

# ఇది నా 11 ఏళ్ళ ఆకలి



'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత పవర్ స్టార్ పవన్ కళ్యాణ్, స్టార్ డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబినేషన్ లో రూపొందుతోన్న చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో శ్రీలీల కథానాయికగా నటిస్తున్నారు. దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్ర నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే మొదటి షెడ్యూల్ పూర్తయింది. అలాగే మ్యూజిక్ సిట్టింగ్స్ కూడా మొదలయ్యాయి. ఇక ఇప్పుడు ఈ సినిమా నుంచి మాసివ్ ఫస్ట్ గ్లింప్స్ ని విడుదల చేసి అభిమానుల్లో ఉత్సాహం నింపారు మేకర్స్.

"ఈసారి కేవలం వినోదం మాత్రమే కాదు" అంటూ 'గబ్బర్ సింగ్'ని మించిన సంచలన విజయాన్ని అందుకోవడానికి పవన్ కళ్యాణ్-హరీష్ శంకర్ ల ద్వయం సిద్ధమవుతోంది. కేవలం పవన్ కళ్యాణ్ అభిమానులు మాత్రమే కాదు.. తెలుగు సినీ ప్రియులు సైతం 'గబ్బర్ సింగ్' ప్రభంజనాన్ని అంత తేలికగా మర్చిపోలేరు. అందుకే వీరి కలయికలో రెండో సినిమాగా 'ఉస్తాద్ భగత్ సింగ్' ప్రకటన రాగానే అంచనాలు ఆకాశాన్నంటాయి. దానికితోడు 'గబ్బర్ సింగ్' సెంటిమెంట్ ని పాటిస్తూ ఆ సినిమా విడుదలైన తేదీ మే 11 కే ఉస్తాద్ ఫస్ట్ గ్లింప్స్ విడుదల కావడం మరింత ప్రత్యేకంగా నిలిచింది. ఇటీవల మే 11న ఉస్తాద్ ఫస్ట్ గ్లింప్స్ విడుదల కానుందని ప్రకటన వచ్చినప్పటి నుంచే ఎక్కడ చూసినా దీని గురించే చర్చ జరుగుతోంది. సోషల్ మీడియాలోనూ, బయటా అభిమానులు పండగ వాతావరణాన్ని సృష్టించారు.

ఈరోజు హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లోని సంధ్య థియేటర్ వద్ద ఫస్ట్ గ్లింప్స్ విడుదల వేడుక ఘనంగా జరిగింది. సాయంత్రం 4:59 కి విడుదల చేసిన ఈ ఫస్ట్ గ్లింప్స్ అభిమానులకు అంచనాలకు మించి ఉంది. "ఏ కాలమున ధర్మమునకు హాని కలుగునో, అధర్మము వృద్ధి నొందునో, ఆయా సమయములయందు ప్రతి యుగమునా అవతారము దాల్చుచున్నాను" అంటూ ఘంటసాల గాత్రంతో భగవద్గీతలోని శ్లోకంతో గ్లింప్స్ ప్రారంభమైంది. "భగత్.. భగత్ సింగ్.. మహంకాళి పోలీస్ స్టేషన్, పాతబస్తీ" అంటూ ఖాకీ చొక్కా, గళ్ళ లుంగీ, నుదుటున తిలకంతో జీపులోనుంచి దూకుతూ అదిరిపోయే ఎంట్రీ ఇచ్చారు కథానాయకుడు పవన్ కళ్యాణ్. కేవలం 40 సెకన్ల వీడియోలోనే తన మ్యానరిజమ్స్, యాటిట్యూడ్, ఆవేశంతో గూజ్ బంప్స్ తెప్పించారు. "ఈసారి పర్ఫామెన్స్ బద్దలైపోయిద్ది" అంటూ సినిమా ఏ రేంజ్ లో ఉండబోతుందో ముందే చెప్పేశారు. "హుట్ సాలే" అంటూ వింటేజ్ యాటిట్యూడ్ తో పవన్ కళ్యాణ్ పలికిన తీరుకి ఫిదా కాకుండా ఉండలేము. ఇక దేవి శ్రీ ప్రసాద్ అందించిన నేపథ్య సంగీతం గ్లింప్స్ ని మరోస్థాయికి తీసుకెళ్లింది.

అభిమానుల సమక్షంలో పండుగలా జరిగిన ఈ వేడుకలో పవన్ కళ్యాణ్ వీరాభిమాని సతీష్ కోట చేతుల మీదుగా గ్లింప్స్ ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు హరీష్ శంకర్ మాట్లాడుతూ.. "గబ్బర్ సింగ్ మన పదేళ్ల ఆకలి తీరిస్తే.. గబ్బర్ సింగ్ నుంచి భగత్ సింగ్ వరకు ఇది నా 11 ఏళ్ళ ఆకలి. ఈ క్షణం కోసం 11 ఏళ్లుగా ఎదురుచూస్తున్నాను. అందుకే ఈ ఎగ్జైట్ మెంట్ ని ఫ్యాన్స్ తో పంచుకోవాలని, మీ సమక్షంలో గ్లింప్స్ ని విడుదల చేస్తున్నాం" అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత నవీన్ యెర్నేని, దర్శకులు దశరథ్, చంద్రమోహన్, నిర్మాత ఎస్.కె.ఎన్ తదితరులు పాల్గొన్నారు.

ఈ చిత్రం కోసం అత్యుత్తమ సాంకేతిక బృందం పని చేస్తోంది. ఈ సినిమాకి ఆర్ట్ డైరెక్టర్ గా ఆనంద్ సాయి, సినిమాటోగ్రాఫర్ గా అయానంక బోస్, ఎడిటర్ గా చోటా కె. ప్రసాద్ వ్యవహరిస్తున్నారు. రామ్-లక్ష్మణ్ ద్వయం ఈ చిత్రంలో యాక్షన్ సన్నివేశాలకు కొరియోగ్రఫీ చేస్తున్నారు.

తారాగణం: పవన్ కళ్యాణ్, శ్రీలీల, అశుతోష్ రాణా, నవాబ్ షా, కేజీఎఫ్ అవినాష్, గౌతమి, నర్రా శ్రీను, నాగ మహేష్, టెంపర్ వంశీ తదితరులు

Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950